

4న కురుపాంలో జాబ్‌మేళా

పార్వతీపురం రూరల్: కురుపాం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈనెల 4న జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ సోమ వారం ఒక ప్రకటనలో తెలిపారు. హెటిరో డ్రగ్స్, టీమ్ లీజ్, ఫ్యూచర్‌మ్యాన్ పవర్ అండ్ సెక్యూరిటీ సర్వీసెస్, వరుణ్ మోటార్స్, భారత్ పే సంస్థల్లో ఉద్యోగాల కోసం ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు చెప్పారు. టెన్త్, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ పూర్తయిన 18 నుంచి 25 సంవత్సరాల లోపు నిరుద్యోగ యువతీ యువకులు అర్హులని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు ఈ 63034 93720, 89788 78557 నెంబర్లకు ఫోన్ చేయాలని సూచించారు.

పెట్టిందే మెనూ.. అదే తిను!

● గిరిజన ఆశ్రమ పాఠశాలలు, గురుకులాల్లో మెనూకు తూట్లు ● కొన్నిచోట్ల సిబ్బంది చేతివాటం

● మరోవైపు మౌలిక వసతుల కొరత ● కొరవడిన ఉన్నతాధికారుల పర్యవేక్షణ ● విద్యార్థులకు తప్పని ఇబ్బందులు



చాలీచాలని కూరతో భోజనం చేస్తున్న గిరిజన విద్యార్థి

సీతంపేట రూరల్, సెప్టెంబరు 30: సీతంపేట ఐటీడీఏ పరిధిలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు, గురుకులాలు, వసతిగృహాల్లో సక్రమంగా మెనూ అమలు కావడం లేదు. విద్యార్థులకు నాణ్యమైన , రుచికరమైన భోజనం అందించాల్సిన కొంతమంది పాఠశాలల సిబ్బంది చేతివాటం ప్రదర్శిస్తున్నారు. 'పెట్టిందే మెనూ.. అదే తిను' అన్న చందంగా వ్యవహరిస్తున్నారు. దీంతో గిరిజన విద్యార్థులకు ఆకలి బాధలు తప్పడం లేదు. చాలీచాలని కూరలు, ఉడికీ ఉడకని అన్నం.. నీరు లాంటి సాంబారు , రెండు ముక్కల చికెన్‌తో సర్దుకోవాల్సి వస్తోంది. మరోవైపు సౌకర్యాలేమి కూడా వారిని తీవ్రంగా వేధిస్తోంది. చాలాచోట్ల నేలపైనే కూర్చొని భోజనం చేయాల్సి వస్తోంది. అమాయక గిరిజన బిడ్డలు ప్రశ్నించలేకపోవడం.. ఉన్నతాధికారుల పర్యవేక్షణ కొరవడడంతో పాఠశాలల సిబ్బంది ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

ఇదీ పరిస్థితి..

గిరిజన విద్యను బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తుంటే.. క్షేత్రస్థాయిలో మాత్రం సిబ్బంది తీరుతో భిన్న పరిస్థితులు నెలకొన్నాయి. సీతంపేట ఐటీడీఏ పరిధిలో 47 గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు, 18 పోస్టుమెట్రిక్ వసతిగృహాలు, 8 గురుకులాలు, 2 మినీ గురుకులాలు, 3 కేజీబీవీలు ఉన్నాయి. వాటిల్లో సుమారు 16 వేల మంది గిరిజన విద్యార్థులు చదువుతున్నారు. వారికి ప్రభుత్వ నిబంధనల మేరకు పక్కాగా మెనూ అమలు చేయాల్సి ఉంది. రోజూ నాణ్యమైన భోజనం పెట్టాల్సి ఉంది. అయితే ఏ పాఠశాలలోనూ మెనూ సక్రమంగా అమలు కావడం లేదనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. ఐటీడీఏకు కూత వేటు దూరంలో ఉన్న పాఠశాలల్లో అయితే పరిస్థితి మరీ దారుణంగా ఉంది.

ఆశ్రమ, గురుకులాల్లో ఇలా...

ఐటీడీఏ పరిధిలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు కూటమి ప్రభుత్వం ప్రత్యేక మెనూను ప్రకటించింది. దీనిని పక్కాగా అమలు చేయాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. అయితే క్షేత్రస్థాయిలో మాత్రం అది ఆచరణకు నోచుకోవడం లేదు. వాస్తవంగా ఆశ్రమ పాఠశాలల్లో పిల్లలకు ఒక్క శనివారం తప్ప రోజూ ఉదయం పూట ఉడకపెట్టిన గుడ్డు ఇవ్వాల్సి ఉంది. ఆదివారం మధ్యాహ్నం, మంగళవారం రాత్రి చికెన్ కర్రీ, కచెంబరీ, పెరుగు, గోంగూర చట్నీ ఇవ్వాలి. కేజీబీవీ, గురుకులాల్లో అయితే ఉదయం అల్పాహారంలో చిన్నపాటి మార్పులు మినహా వారంలో రెండు రోజులు చికెన్ కర్రీ, గోంగూర చట్నీ, పెరుగుతో పాటు మిగిలినవి విద్యార్థులకు పెట్టాల్సి ఉంది. ప్రతి గిరిజన విద్యార్థికి 100 గ్రాములకు తగ్గకుండా చికెన్ కర్రీతో భోజనం పెట్టాలి. కానీ చాలాచోట్ల విద్యార్థులకు రెండు లేదా మూడు చికెన్ ముక్కలు వేసి చేతులు దులుపుకుంటున్నారు. పెరుగు, గోంగూర చట్నీని పూర్తిగా పెట్టడం లేదు.



ప్లేట్లలో రెండు చికెన్ ముక్కలు వేసిన దృశ్యం

సౌకర్యాల లేమి..

గిరిజనుల విద్యాభివృద్ధి కోసం ప్రభుత్వం వేల కోట్ల రుపాయాలు ఖర్చు చేస్తున్నా.. ఆ ఫలాలు విద్యార్థులకు అందడం లేదు. సీతంపేట గురుకుల బాలికల జూనియర్ కళాశాలలో డైనింగ్ హాల్ లేకపోవడంతో విద్యార్థినులు రోజూ చెట్ల కింద, ఖానాలపై, సీసీ రహదారిపై కూర్చొని వారు భోజనాలు చేయాల్సి వస్తోంది. గురుకుల పాఠశాలలో డైనింగ్ హాల్ ఉన్నప్పటికీ విద్యార్థినులకు సరిపడా టేబుల్స్ లేని కారణంగా వారు కూడా నేలపైనే కూర్చొని భోజనాలు చేస్తున్నారు. మరికొన్ని పాఠశాలల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది.

పర్యవేక్షణ లోపం..

సీతంపేట ఐటీడీఏ పరిధిలో నిర్వహిస్తున్న గిరిజన పాఠశాలలపై సంబంధిత శాఖ అధికారుల పర్యవేక్షణ కొరవడింది. దీంతో పాఠశాలల నిర్వాహకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. వారు పెట్టిందే మెనూ అన్నట్లుగా పరిస్థితి మారింది. గిరిజన విద్యార్థులు తమ బాధను ఎవరికీ చెప్పుకోలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొందరు పౌష్టికాహార లోపంతో బాధపడుతున్నారు. మరికొందరు అనారోగ్య సమస్యలతో ఇంటి దారి పడుతున్నారు. ఇంత జరుగుతున్నా సంబంధిత శాఖ అధికారులు తమకేమీ పట్టనట్టు వ్యవహరిస్తుండడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి నిబంధనల మేరకు గిరిజన పాఠశాలల్లో మెనూ అమలు, మౌలిక వసతుల కల్పనపై చర్యలు తీసుకోవాలని గిరిజన సంఘాల నాయకులు కోరుతున్నారు.

డీడీ ఏమన్నారంటే...

'గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల, వసతిగృహాలు, గురుకులాల్లో మెనూ పక్కాగా అమలు చేయాలని ఆదేశాలు జారీ చేశాం. మెనూ అమలు చేయని పాఠశాలలపై చర్యలు తీసుకుంటాం. గురుకులాల్లో డైనింగ్ హాల్ నిర్మాణాలకు గాను ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం.' అని గిరిజన సంక్షేమశాఖ డీడీ అన్నదొర తెలిపారు.



ఆరు బయట నేలపై కూర్చొని భోజనాలు చేస్తున్న గురుకుల కళాశాల విద్యార్థినులు

నేడు పింఛన్ల పంపిణీ

పార్వతీపురం, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ భరోసా పింఛన్లను నేడు జిల్లావ్యాప్తంగా పంపిణీ చేయనున్నట్లు కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సంబంధిత అధికారులతో మాట్లాడారు. మంగళ వారం లబ్ధిదారులకు అందుబాటులో ఉండి పింఛన్ల సొమ్ము అందజేయాలని ఆదేశించారు. ప్రతినెలా జిల్లాలో 1.42 లక్షల మందికి పింఛన్ల కింద రూ. 59.37 కోట్లు అందిస్తున్నామన్నారు. మండల ప్రత్యేక అధికారులు, ఎంపీడీవోలు పర్యవేక్షించాలని ఆదేశించారు.



అర్జీలు పెండింగ్‌లో ఉంచొద్దు

● ప్రజా సమస్యల పరిష్కార వేదికలో మంత్రి సంధ్యారాణి ● 238 వినతుల స్వీకరణ



వినతులు స్వీకరిస్తున్న మంత్రి సంధ్యారాణి

సాలూరు రూరల్/ మక్కువ, సెప్టెంబరు 30: ప్రజా సమస్యల పరిష్కార వేదికలో పలు సమస్యలపై వచ్చే అర్జీలు పెండింగ్‌లో ఉంచరాదని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు. వాటి పరిష్కారంపై అధికారులు దృష్టి సారించాలని ఆదేశించారు. సాలూరు ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రితో కలెక్టర్, ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో ఆశుతోష్ శ్రీవాస్తవ, జేసీ శోభిక తదితరులు ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. భూ, రెవెన్యూ, పింఛన్లు తదితర సమస్యలపై 238 అర్జీలు వచ్చాయి. వాటిల్లో కొన్ని ఇలా..

సాలూరు మండలం బొడ్డపాడులో అంగన్‌వాడీ భవనం నిర్మించాలని ఆ గ్రామానికి చెందిన రమేష్ కోరారు. దివ్యాంగ పించను మంజూరు చేయాలని సాలూరు వాసి వరలక్ష్మి, దివ్యాంగురాలైన తనకు బ్యాటరీ బండి ఇప్పించాలని పట్టణానికి చెందిన ఎన్.వసంతమ్మ కోరారు. రీ సర్వేలో తనకు అన్యాయం జరిగిందని మక్కువ మండలం మార్కొండ పుట్టికి చెందిన గౌరమ్మ ఫిర్యాదు చేశారు. తన భూమికి జిరాయితీ పట్టా మంజూరు చేయాలని సాలూరు మండలం ముగడవలసకు చెందిన సత్యవతి కోరారు. తోటపల్లి బ్యారేజ్‌లో గుర్రపుడెక్కల వల్ల తమ వలలు చిరిగి పోతున్నాయని, తెప్పలతో వెళ్లలేకపోతున్నామని మత్స్యకారులు తెలిపారు. సాలూరు ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలో ఎంఎస్‌సీ ఆర్గానిక్ కెమిస్ట్రీ పీజీ కోర్సు చదువుతున్న తమకు 2023-2024 ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలు ఇప్పించాలని విద్యార్థులు కోరారు. తన భూమి ఆక్రమణకు గురైందని తోణాంకు చెందిన జగదీశ్వరరావు ఫిర్యాదు చేశారు. వితంతు పింఛను మంజూరు చేయాలని అదే గ్రామానికి చెందిన సరోజిని, రేషన్ కార్డు మంజూరు చేయాలని నాగమణి కోరారు. తోటపల్లి బ్యారేజీలో చేపల వేటకు లీజు మంజూరు చేయాలని కోటవాని వలస ఎస్టీలు వినతి పత్రం అందించారు. ఆర్‌బీకే నిర్మాణానికి రావాల్సిన తుది బిల్లు, 300 బస్తాల సిమెంట్‌కు సొమ్ము మంజూరు చేయాలని విశ్వనాథపురానికి చెందిన జి.గణపతి కోరారు. ఇందిరమ్మ ఇల్లు నిర్మించక పోయినా పది బస్తాల సిమెంట్‌ను ఇచ్చినట్టు ఆన్‌లైన్‌లో చూపిస్తుందని దానిని రిమూవ్ చేయాలని అదే గ్రామ వాసి గొర్లె దేవేంద్ర కోరారు. ఇల్లు మంజూరు చేయాలని దిగువమెండంగికి చెందిన బుజ్జమ్మ, తాడివలసకు బీటీ రోడ్డు నిర్మించాలని నూకయ్య అర్జీలు అందించారు.

గ్రామైక్య సంఘాలకు భరోసా

● రూ.20 లక్షల వరకు రుణం

● రూ.10 లక్షల వరకు వడ్డీ రాయితీ

● కూటమి ప్రభుత్వం నిర్ణయంపై జిల్లావాసుల హర్షం



పార్వతీపురం, సెప్టెంబరు30 (ఆంధ్రజ్యోతి): గ్రామైక్య సంఘాలకు కూటమి ప్రభుత్వం భరోసా కల్పించింది. మహిళా సంఘాలు ఏర్పాటు చేసుకునే యూనిట్ల ఆధారంగా రుణాలు మంజూరు చేస్తూ.. వారి ఆర్థిక పురోగతికి సర్కారు దోహదపడనుంది. దీనిలో భాగంగా సంఘాలకు ఇచ్చే రుణంలో రూ.పది లక్షల వరకు వడ్డీ రాయితీ ఇవ్వాలని నిర్ణయించింది. అదేవిధంగా రూ.మూడు లక్షల నుంచి రూ. 20 లక్షల వరకు బ్యాంకు లింకేజీల ద్వారా రుణాలుగా అందించాలని నిశ్చయించింది. అయితే దీనిపై త్వరలో విధి విధానాలు రానున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఏదేమైనా కూటమి ప్రభుత్వ నిర్ణయంతో జిల్లాలో గ్రామైక్య సంఘాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. వాస్తవంగా 'మన్యం'లో 12,661 మహిళా సంఘాలు ఉన్నాయి. వారికి ఈ ఆర్థిక సంవత్సరంలో బ్యాంకు లింకేజీల ద్వారా రూ.585 కోట్లు రుణాల కింద అందించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఇప్పటికే 2,415 సంఘాలకు రూ.126 కోట్లు రుణాల రూపంలో ఇచ్చినట్లు అధికారులు చెబుతున్నారు. కాగా మిగిలిన సంఘాలకు రూ.459 కోట్లను అందించాలని వెలుగు శాఖ అధికారులు, సిబ్బందికి ప్రభుత్వం ఆదేశించింది.

గత వైసీపీ పాలనలో ఎన్నో ఇబ్బందులు

గత వైసీపీ ప్రభుత్వ కాలంలో మహిళా సంఘాలు బ్యాంకు లింకేజీల ద్వారా రుణాలు పొందాలంటే ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొనేవారు. వారితో వెలుగు సిబ్బంది కూడా బ్యాంకుల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వచ్చేది. సంఘ సభ్యులంతా ఫొటోలు తీసుకొని అవసరమైన ధ్రువ పత్రాలు అందించినప్పటికీ.. రుణం మంజూరయ్యే సరికి కనీసం 15 నుంచి 20 రోజులు పట్టేది. ఇదిలా ఉండగా గతంలో రూ.మూడు లక్షల వరకు మాత్రమే వడ్డీ రాయితీ ఉండేది. మరోవైపు బ్యాంకులు కూడా నిబంధనల పేరిట ముప్పుతిప్పలు పెట్టేవి. మొత్తంగా గతంలో మహిళా సంఘాల సభ్యులు రుణాలు పొందాలంటే ఓ పెద్ద ప్రహసనమే అని చెప్పొచ్చు. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం మాత్రం గ్రామైక్య సంఘాల ఆర్థిక పురోగతిపై దృష్టిసారించింది. సకాలంలో సభ్యులకు రుణాలు ఇవ్వాలని అధికారులకు ఆదేశాలిచ్చింది. అయితే ప్రభుత్వ లక్ష్యం నెరవేరాలంటే ఉన్నతాధికారుల పర్యవేక్షణ ఎంతో అవసరమని పార్వతీపురం మన్యం జిల్లా వాసులు అభిప్రాయపడుతున్నారు.

లక్ష్య సాధనకు కృషి

జిల్లాలో బ్యాంకు లింకేజీల ద్వారా రూ.585 కోట్లు అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. ఇప్పటివరకు రూ.126 కోట్లు రుణాల రూపంలో అందించాం. లక్ష్య సాధనకు కృషి చేస్తున్నాం.

- సత్యంనాయుడు, ఇన్‌చార్జి పీడీ, డీఆర్‌డీఏ, పార్వతీపురం మన్యం

పర్యాటక కేంద్రంగా కోట

● విజయనగర రాజుల చరిత్ర, దాతృత్వం తెలిసేలా లేజర్ షోలు

విజయనగరం(ఆంధ్రజ్యోతి), సెప్టెంబరు 30: విజయనగరం రాజుల చారిత్రక వారసత్వ సంపదగా ఉన్న కోటను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని కలెక్టర్ అంబేడ్కర్ ప్రకటించారు. స్థానిక ఎమ్మెల్యే అదితి గజపతిరాజు, ఆర్డీవో కీర్తి తదితరులతో ఆయన కోటను సోమవారం సందర్శించారు. విజయనగరం ఉత్సవ ఏర్పాట్లపై సూచనలు ఇచ్చారు. నగరానికి ఐకాన్‌గా నిలిచిన మహారాజుల కోటలో అన్ని హంగులతో సుందరీకరణ పనులు చేపడతామన్నారు. ఉత్సవాల నేపథ్యంలో కోట చుట్టూ వివిధ రకాల పూలు, ఔషధ గుణాలతో కూడిన మొక్కలను నాటాలని, పచ్చని తివాచీలా కనిపించేలా నాణ్యమైన పచ్చగడ్డిని పెంచాలని సూచించారు. ఇదంతా నెల10లోగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్ , అధికారులను ఆదేశించారు. జిల్లా కేంద్రంలో మొదటిసారిగా అత్యాధునిక సౌండ్ సిస్టంతో కూడిన లేజర్ షోను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

ఉత్సవాలకు 12 వేదికలు

విజయనగరం రూరల్ : విజయనగరం ఉత్సవాలకు 12 వేదికలను సిద్ధం చేస్తున్నట్టు కలెక్టర్ తెలిపారు. ఈ వేదికలకు ఇన్‌చార్జుల నియామకంలో అధికారులు, లైఫ్ మెంబర్లకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు పేర్కొన్నారు.



కోట వద్ద అధికారులతో చర్చిస్తున్న విజయనగరం కలెక్టర్, ఎమ్మెల్యే

సమస్యల ఏకరువు

● మున్సిపల్ సమావేశంలో గళమెత్తిన వైసీపీ, టీడీపీ కౌన్సిలర్లు

● పరిష్కరించాలని ఎమ్మెల్యేకి విన్నపం ● రెండు వర్గాలుగా వైసీపీ కౌన్సిలర్లు



సమస్యలను తెలియజేస్తున్న వైసీపీ, టీడీపీ కౌన్సిలర్లు

పార్వతీపురం టౌన్, సెప్టెంబరు 30 : పార్వతీపురం మున్సిపల్ సాధారణ సమావేశంలో వైసీపీ, టీడీపీ కౌన్సిలర్లు గళమెత్తారు. 30 వార్డులో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే బోనెల విజయచంద్రను కోరారు. సోమవారం మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరీ అధ్యక్షతన సాధారణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు కౌన్సిలర్లు మాట్లాడుతూ.. 'మున్సిపాల్టీలో ప్రభుత్వ భూములు ఆక్రమణలకు గురవుతున్నాయి. కొత్తవలస శివారులో ఓ చెరువు కబ్జాకు గురైనా పట్టించుకునే వారే కరువయ్యారు. వ్యర్థాలపై వస్తున్న ఆదాయం ఎటువెళ్లి పోతుందో తెలియడం లేదు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన తప్పిదాల వల్ల మున్సిపాల్టీ ఆదాయానికి గండి పడుతోంది. పట్టణంలో బయో టాయిలెట్లు ఏర్పాటు చేయాలి. టిడ్కో లబ్ధిదారులకు న్యాయం చేయాలి. తాగునీటి సరఫరా సమస్యను పరిష్కరించాలి.. రహదారులు, కాలువల నిర్మాణాలు చేపట్టాలి. కొత్తవలసలో 8వేల మంది జనాభాకు పీహెచ్‌సీ లేదు. దీంతో రెండున్నర కిలో మీటర్ల దూరంలో ఉన్న జిల్లా ఆసుపత్రికి వెళ్లాల్సి వస్తోంది.' అని వారు తెలిపారు. సమావేశంలో కౌన్సిలర్లు కె.నారాయణరావు, బి.గౌరునాయుడు, ఆర్. శివకుమార్, ఆనంద్, దివ్య, బి.కరుణ తదితరులు పాల్గొన్నారు.

పార్టీలకు అతీతంగా పనిచేద్దాం..

పార్టీలకు అతీతంగా పనిచేద్దామని ఎమ్మెల్యే విజయచంద్ర అన్నారు. మున్సిపాల్టీలో పలు సమస్యలను తెలిపిన కౌన్సిలర్లతో ఆయన మాట్లాడుతూ.. జిల్లా కేంద్రంలో ప్రజలకు పూర్తిస్థాయిలో తాగునీటిని సరఫరా చేసేందుకు, పారిశుధ్య నిర్వహణ, రహదారులు, కాలువల నిర్మాణానికి పక్కా ప్రణాళికతో ముందు కెళ్లనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ భూముల ఆక్రమణలకు సంబంధించి ప్రత్యేక కమిటీతో సర్వే చేయిస్తామన్నారు. టిడ్కో లబ్ధిదారులకు త్వరలోనే ఇళ్లను పంపిణీ చేస్తామన్నారు. ఈ నెల మొదటి వారంలో కొత్తవలసలో పీహెచ్‌సీ ఏర్పాట్లు జరుగుతాయని స్పష్టం చేశారు. ఇక నుంచి సమావేశానికి అన్ని శాఖల అధికారులు హాజరయ్యేలా చూస్తామన్నారు. శ్మశాన వాటికల రక్షణకు ప్రత్యేక నిధులు కేటాయిస్తామని చెప్పారు

రెండు వర్గాలుగా ..

చైర్‌పర్సన్, అధికారుల వైఖరి కారణంగా సమావేశాన్ని బహిష్కరిస్తున్నట్లు కొంతమంది వైసీపీ కౌన్సిలర్లు ప్రకటించారు. అయితే మున్సిపల్ చైర్‌పర్సన్‌తో పాటు మరికొంతమంది వైసీపీ కౌన్సిలర్లు సమావేశం మందిరంలోనే ఉండిపోయారు. వారితో పాటు టీడీపీ కౌన్సిలర్లు కూడా అజెండాలో ఉన్న అంశాలకు ఆమోదం తెలిపారు. టీడీపీ ప్రభుత్వ హయాంలోనే త్వరితగతిన అభివృద్ధి జరుగుతుందని పలు వార్డులకు చెందిన వైసీపీ కౌన్సిలర్లు ఎమ్మెల్యే ముందు స్పష్టం చేశారు. దీంతో వైసీపీ కౌన్సిలర్లు రెండు వర్గాలు విడిపోయారనే గుసగుసలు వినిపించాయి.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయచంద్ర

ఏసెట్ అక్టోబరు సెషన్ నోటిఫికేషన్



ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ యాక్చురీస్ ఆఫ్ ఇండియా- స్టూడెంట్ నమోదు సహా తదుపరి యాక్చూరియల్ ఎగ్జామ్స్ రాసేందుకు ఉద్దేశించిన 'యాక్చూరియల్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ (ఏసెట్) 2024 అక్టోబరు సెషన్‌కు దరఖాస్తులు కోరుతోంది. ఎగ్జామ్‌కు సంబంధించిన వివరాలను అభ్యర్థుల ఈ మెయిల్స్‌కు పంపుతారు. అభ్యర్థుల సౌలభ్యం కోసం సంస్థ మాక్ టెస్టులు కూడా నిర్వహిస్తుంది. గత ఆరేళ్ల ప్రశ్న పత్రాలు, వాటి సమాధానాలను వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు. ఏసెట్ స్కోర్ వ్యాలిడిటీ మూడేళ్లు.

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి ఏదేని గ్రూపుతో ఇంటర్ లేదా తత్సమాన పరీక్ష ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. డిప్లొమా, డిగ్రీ కోర్సులు పూర్తిచేసినవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. మేథ్స్, స్టాటిస్టిక్స్, ఎకనామెట్రిక్స్ ప్రధాన సబ్జెక్టులుగా చదివిన వారికి; ఇంజనీరింగ్, మేనేజ్‌మెంట్, చార్టర్డ్ అకౌంటెంట్, కాస్ట్ అకౌంటెంట్, కంపెనీ సెక్రటరీ కోర్సులు చేసినవారికి ప్రాధాన్యం ఉంటుంది.

ఏసెట్ వివరాలు: పరీక్ష సమయం మూడు గంటలు. ఇందులో మేథమెటిక్స్, స్టాటిస్టిక్స్, ఇంగ్లీష్, డేటా ఇంటర్‌ప్రిటేషన్, లాజికల్ రీజనింగ్ అంశాలనుంచి 70 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. మొత్తం మార్కులు 100. ఒక మార్కు ప్రశ్నలు 45, రెండు మార్కుల ప్రశ్నలు 20, మూడు మార్కుల ప్రశ్నలు 5 అడుగుతారు. మేథమెటిక్స్, స్టాటిస్టిక్స్‌లకు సంబంధించి ఒక్కోదానిలో 30 మార్కులకు; డేటా ఇంటర్‌ప్రిటేషన్, ఇంగ్లీష్‌లకు సంబంధించి ఒక్కోదానిలో 15 మార్కులకు; లాజికల్ రీజనింగ్ నుంచి 10 మార్కులకు ప్రశ్నలు ఇస్తారు. రుణాత్మక మార్కులు లేవు. ఈ పరీక్షలో అర్హత సాధించాలంటే కనీసం 50 శాతం మార్కులు రావాలి.

ఏసెట్ నిర్వహణ: ఇది హోమ్ బేస్డ్ ఆన్‌లైన్ ఎగ్జామ్. ఈ పరీక్ష రాయదలచుకొన్న అభ్యర్థులు సంస్థ నిర్దేశించిన మేరకు హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్ సాంకేతికతను అందుబాటులో ఉంచుకోవాలి.

- హార్డ్‌వేర్‌కు సంబంధించి పర్సనల్ ల్యాప్‌టాప్/డెస్క్‌టాప్, 640x480 @ 15fps రిజల్యూషన్ ఉన్న వెబ్ కెమెరా, 1 ఎంబీపీఎస్ బ్యాండ్‌విడ్త్‌తో వైర్డ్/వైర్‌లెస్ ఇంటర్నెట్, 2 జీబీ ర్యామ్, 2 కోర్స్-4 థ్రెడ్స్-2.2 గిగా హెర్ట్జ్ ప్రాసెసర్, 64 ఎంబీ గ్రాఫిక్స్ మెమరీ, 1024 x 768 కంటే తక్కువ కాకుండా స్క్రీన్ రిజల్యూషన్, మల్టీ మీడియా సపోర్ట్ ఉన్న సౌండ్ కార్డ్ ఏర్పాటు చేసుకోవాలి.
- సాఫ్ట్‌వేర్‌కు సంబంధించి విండోస్ 10/8/7 ఆపరేటింగ్ సిస్టమ్, లేటెస్ట్ వెబ్ బ్రౌజర్, 4.5.2 నెట్ ఫ్రేమ్ వర్క్ సిద్ధం చేసుకోవాలి.
- పరీక్ష రాసే సమయంలో ఒరిజినల్ ఆధార్ కార్డ్/డ్రైవింగ్ లైసెన్స్/పాస్‌పోర్ట్/ఓటర్ ఐడీ కార్డ్/పాన్ కార్డ్‌లను దగ్గర ఉంచుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** అక్టోబరు 5
- **ఏసెట్ 2024 అక్టోబరు సెషన్ తేదీ:** అక్టోబరు 13
- **వెబ్‌సైట్:** www.actuariesindia.org

దిక్సూచి DIKSUCHI

ఎన్టీఆర్ వర్సిటీ మెడికల్ పీజీ నోటిఫికేషన్

విజయవాడలోని డా.ఎన్‌టీఆర్ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ (ఎన్‌టీఆర్‌యూహెచ్‌ఎస్)- పోస్ట్ గ్రాడ్యుయేట్ మెడికల్ డిగ్రీ/డిప్లొమా ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. మేనేజ్‌మెంట్ కోటా కింద ప్రైవేట్ నాన్ మైనారిటీ, మైనారిటీ మెడికల్ కాలేజీల్లో; స్టేట్ కోటా/కాంపిటెంట్ అథారిటీ కోటా కింద డా.ఎన్‌టీఆర్ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్(ఎన్‌టీఆర్‌యూహెచ్‌ఎస్), శ్రీ వేంకటేశ్వర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(స్విమ్స్) అనుబంధ కళాశాలల్లో సీట్ల భర్తీకి విడివిడిగా నోటిఫికేషన్‌లు విడుదల చేసింది. ప్రభుత్వ మెడికల్ కళాశాలల్లో 50 శాతం సీట్లను స్టేట్ కోటా/కాంపిటెంట్ అథారిటీ కోటా కింద; మిగిలిన 50 శాతం సీట్లను ఆలిండియా కోటా కింద భర్తీ చేస్తారు. ప్రైవేట్ అన్ ఎయిడెడ్ నాన్ మైనారిటీ, మైనారిటీ మెడికల్ కాలేజీల్లో 50 శాతం సీట్లను కాంపిటెంట్ అథారిటీ కోటా కింద, మిగిలిన 50 శాతం సీట్లను మేనేజ్‌మెంట్ కోటా కింద భర్తీ చేస్తారు. పీజీ డిగ్రీ వ్యవధి మూడేళ్లు. పీజీ డిప్లొమా వ్యవధి రెండేళ్లు.

అర్హత: పీజీ మెడికల్ డిగ్రీ/డిప్లొమా కోర్సుల్లో ప్రవేశానికి ఎంబీబీఎస్ ఉత్తీర్ణులై ఉండాలి. ఆగస్టు 15 నాటికి ఇంటర్న్‌షిప్ పూర్తిచేసి ఉండాలి. నీట్ పీజీ 2024 ఎగ్జామ్‌లో జనరల్, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు 50 పర్సంటైల్; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులకు 40 పర్సంటైల్; జనరల్ కేటగిరీ దివ్యాంగులకు 45 పర్సంటైల్ మార్కులు ఉండాలి. మెడికల్ కౌన్సిల్ గుర్తింపు తప్పనిసరి.

- **దరఖాస్తు ఫీజు:** తెలుగు రాష్ట్రాల్లో ఎంబీబీఎస్ పూర్తిచేసిన అభ్యర్థులకు రూ.7080; ఇతర రాష్ట్రాల్లో ఎంబీబీఎస్ పూర్తిచేసిన వారికి రూ.10,620; విదేశాల్లో చదివినవారికి రూ.15,340
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** అక్టోబరు 4
- **వెబ్‌సైట్:** https://dmtr.uhsap.in

సీటీటీసీలో ట్రెయినింగ్ ప్రోగ్రామ్‌లు

భువనేశ్వర్‌లోని సెంట్రల్ టూల్ రూమ్ అండ్ ట్రెయినింగ్ సెంటర్(సీటీటీసీ)- ఉచిత శిక్షణ ప్రోగ్రామ్‌లను నిర్వహిస్తోంది. ఒక్కో ప్రోగ్రామ్ వ్యవధి మూడు నెలలు. వీటిని నేషనల్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్(ఎన్‌ఎస్‌డీసీ) స్పాన్సర్ చేస్తోంది. ఫస్ట్ కమ్ ఫస్ట్ సర్వ్ పద్ధతిలో అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

సీఎన్‌సీ ఆపరేటర్: సీఎన్‌సీ ఆపరేటర్ టర్నింగ్ ప్రోగ్రామ్‌లో 300 సీట్లు, సీఎన్‌సీ ఆపరేటర్ వర్టికల్ ప్రోగ్రామ్‌లో 250 సీట్లు ఉన్నాయి.

- **అర్హత:** (ఐటీఐ/డిప్లొమా)(మెకానికల్/ఫిట్టర్/ఇన్‌స్ట్రుమెంటేషన్) ఉత్తీర్ణులు అప్లయ్ చేసుకోవచ్చు.

సీఎన్‌సీ ప్రోగ్రామర్: ఇందులో 210 సీట్లు ఉన్నాయి.

- **అర్హత:** (డిప్లొమా/బీఈ/బీటెక్)(మెకానికల్) ఉత్తీర్ణులు అప్లయ్ చేసుకోవచ్చు.
- **దరఖాస్తుకు చివరి తేదీ:** అక్టోబరు 22
- **వెబ్‌సైట్:** www.cttc.gov.in

ఐసర్ భోపాల్‌లో పీహెచ్‌డీ

భోపాల్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ (ఐసర్)- పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. అకడమిక్ మెరిట్, ఇంటర్వ్యూ ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు.


విభాగాలు: నేచురల్ సైన్సెస్ స్ట్రీమ్-బయలాజికల్ సైన్సెస్, కెమిస్ట్రీ, ఎర్త్ అండ్ ఎన్విరాన్‌మెంటల్ సైన్సెస్, ఫిజిక్స్. • ఇంజనీరింగ్ సైన్సెస్ స్ట్రీమ్- కెమికల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్, డేటా సైన్స్ అండ్ ఇంజనీరింగ్. • హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ స్ట్రీమ్- ఎకనామిక్ సైన్సెస్, హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్(కాగ్నిటివ్ సైన్స్, సోషల్ వర్క్ అండ్ సోషియాలజీ)

అర్హత: స్పెషలైజేషన్‌ను అనుసరించి సంబంధిత విభాగాల్లో ప్రథమ శ్రేణి మార్కులతో ఎంఈ/ఎంటెక్/ఎంఎస్/ఎమ్మెస్సీ/ఎంఏ ఉత్తీర్ణులు; ఎంసీఏ/బీఈ/బీటెక్/బీఎస్ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. గేట్ వ్యాలిడ్ స్కోర్ లేదా సీఎస్ఐఆర్ జేఆర్ఎఫ్/యూజీసీ జేఆర్ఎఫ్/డీబీటీ జేఆర్ఎఫ్/ ఐసీఎంఆర్ జేఆర్ఎఫ్/ఇన్‌స్పయిర్ జేఆర్ఎఫ్/రాజీవ్‌గాంధీ నేషనల్ ఫెలోషిప్/సీఎస్ఐఆర్ ఎల్ఎస్/యూజీసీ ఎల్ఎస్ అర్హత తప్పనిసరి. కనీసం 8 సీజీపీఏ స్కోర్‌తో ఐఐటీల నుంచి బీఈ/బీటెక్ అలాగే ఐసర్ల నుంచి బీఎస్ - ఎంఎస్ పూర్తిచేసినవారికి గేట్/ఫెలోషిప్ అర్హత అవసరం లేదు. మెడికల్ సంబంధిత స్పెషలైజేషన్‌లకు ఎంబీబీఎస్ పూర్తిచేసినవారు కూడా అర్హులే. జీఆర్ఈ జనరల్ టెస్ట్‌లో 280 స్కోర్/గేట్ వ్యాలిడ్ స్కోర్, టోఫెల్‌లో 60 స్కోర్/ఐఈఎల్‌టీఎస్‌లో 6 స్కోర్ తప్పనిసరి. • **చివరి తేదీ:** అక్టోబరు 14

- **వెబ్‌సైట్:** www.iiserb.ac.in/

బెంగాల్ టైగర్‌కు ఫాల్కే పురస్కారం





బాలీవుడ్‌లో 'బెంగాల్ టైగర్'గా పేరొందిన నటుడు మిథున్ చక్రవర్తికి 2022 సంవత్సరానికిగాను ప్రతిష్ఠాత్మక దాదాసాహెబ్ ఫాల్కే అవార్డ్ ఇస్తున్నట్లు కేంద్ర సమాచారశాఖ మంత్రి అశ్విన్ వైష్ణవ్ ఎక్స్ వేదికగా ప్రకటించారు. ఆశా పరేఖ్, కుష్బూ, విపుల్ అమృత్‌లాల్ షా సభ్యులుగా ఉన్న జ్యూరీ కమిటీ ఈ అవార్డ్‌కు మిథున్ పేరుని ఎన్నిక చేసిందని మంత్రి వెల్లడించారు. దేశంలోని అత్యున్నత పురస్కారాల్లో మూడోది అయిన పద్మభూషణ్ పొందిన ఆరు నెలల కాలంలో భారతీయ చిత్ర పరిశ్రమ ఎంతో ప్రతిష్ఠాత్మకంగా భావించే దాదాసాహెబ్ ఫాల్కే అవార్డ్ వరించడంతో బెంగాలీబాబు మిథున్ చక్రవర్తి నట జీవితానికి ఓ సార్థకత లభించిందని చెప్పాలి. మిగతా హీరోల్లా ఆయన కెరీర్ మొదటి నుంచీ అంత సాఫీగా సాగలేదు. ప్రతి దశలోనూ పోరాటమే. విద్యార్థి దశలోనే కాదు చిత్ర పరిశ్రమలోనూ ఆయనది పోరుబాటే. పోరాడి అన్నీ సాధించుకున్నారు మిథున్. అయితే ఆయన అసలు పేరు అది కాదు.. గౌరంగ చక్రవర్తి. 1950 జూన్ 16న కోల్‌కతాలో పుట్టిన గౌరంగ బి.ఎస్సీ చదివారు. వామపక్ష భావజాలం కలిగి ఉండడంతో సమాజంలో పెట్టుబడిదారీ వ్యవస్థ చేస్తున్న దోపిడి చూసి తట్టుకోలేకపోయేవారు. నక్సలిజం ఉద్యమం పట్ల ఆకర్షితుడై సోదరుడితో కలసి అందులో చేరి ఉద్యమకారుడిగా పీడిత ప్రజల్ని ఆకట్టుకున్నారు. అయితే తన సోదరుడు మరణించిన తర్వాత ఉద్యమ బాట వదిలి జనంలోకి వచ్చారు. బెంగాల్‌లో ఇక ఉండలేక ముంబైకి వెళ్లిపోయారు. మొదట్లో సినిమాల మీద ఆసక్తి ఉండేది కాదు. బతకడం కోసం ఏదన్నా ఉద్యోగం చేయాలనుకుని ఓ నైట్ క్లబ్‌లో డాన్సర్‌గా చేరారు. ఆ క్లబ్‌కు వచ్చిన సినీ ప్రముఖుల దృష్టిని ఆకర్షించారు. బెంగాలీ దర్శకుడు మృణాల్ సేన్ 'మృగయా'(1976) చిత్రంలో మిథున్‌కు అవకాశం ఇచ్చారు. అవార్డ్ వచ్చిన సందర్భంగా మిథున్ తన గతాన్ని గుర్తు చేసుకున్నారు. 'ముంబైకి వచ్చిన తొలి రోజుల్లో తినడానికి తిండి దొరికేది కాదు. గార్డెన్‌లో పడుకున్న రోజులు ఉన్నాయి. ఆ కష్టాలు తట్టుకోలేక చచ్చిపోదామని ఎన్నోసార్లు అనిపించేది. కానీ నాకు నేనే ధైర్యం చెప్పుకొన్నా. మంచి రోజులు వస్తాయని నమ్మా. ఆ నమ్మకమే నన్ను నిలబెట్టింది' అని చెప్పారు 74 ఏళ్ల మిథున్.


బాలీవుడ్‌పై బలమైన ముద్ర

తొలి చిత్రంతోనే జాతీయ అవార్డ్ పొందిన మిథున్ చక్రవర్తి నట జీవితాన్ని మలుపు తిప్పిన సినిమా 'డిస్కో డాన్సర్'. అందులో 'ఐయామే డిస్కో డాన్సర్' అంటూ ఆయన తెరపై డాన్స్ చేస్తుంటే థియేటర్లలో ప్రేక్షకులు ఆనందంతో గంతులు వేశారు. అమ్మాయిలు వెర్రెత్తి పోయేవారు. 80ల దశకంలో హిందీ సినిమాపై ఎంతో ప్రభావం చూపిన నటుడాయన. హీరో అనే పదానికి అర్థం మార్చేసిన మిథున్ 1989లో 19 చిత్రాల్లో నటించి రికార్డ్ నెలకొల్పారు. బాలీవుడ్‌లో 'బెంగాల్ టైగర్'గా పేరు తెచ్చుకోవడమే కాదు రెండు సార్లు ఉత్తమ నటుడిగా, ఒకసారి సహాయ నటుడిగా మిథున్ జాతీయ అవార్డులు అందుకొన్నారు. హిందీలోనే కాకుండా బెంగాలీ, ఒరియా, భోజ్‌పురి భాషల్లో 370 పైగా చిత్రాల్లో నటించారు. తెలుగులో పవన్‌కల్యాణ్ నటించిన 'గోపాల గోపాల'లో విలన్‌గా ఆకట్టుకొన్నారు. ఆమధ్య వచ్చిన 'కశ్మీరీ ఫైల్స్' చిత్రంలో మిథున్ నటనని ప్రేక్షకులు మరువలేరు. మంచి పాత్రల కోసం ఇప్పటికీ పరితపించే ఈ నటుడు తనకు వచ్చిన దాదాసాహెబ్ ఫాల్కే అవార్డ్‌ను తన కుటుంబానికి, అభిమానులకు అంకితం చేస్తున్నట్లు ప్రకటించారు. అక్టోబర్ 8న జరిగే జాతీయ చలన చిత్ర అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో మిథున్‌కు దాదాసాహెబ్ ఫాల్కే అవార్డ్ అందజేస్తారు.

నవ్య | చిత్రజ్యోతి

రా మచ్చా

రామ్ చరణ్ కథానాయకుడిగా శంకర్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న పాన్ ఇండియా చిత్రం 'గేమ్ చేంజర్'. క్రిస్మస్ సందర్భంగా ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధమవుతోంది. ఈ చిత్రం నుంచి రెండోపాటను మేకర్స్ సోమవారం విడుదల చేశారు. 'రా మచ్చా మచ్చా' అంటూ హీరో పాత్రను



పరిచయం చేస్తూ సాగే ఈ గీతానికి అనంత్ శ్రీరామ్ సాహిత్యం అందించారు. తమన్ స్వరాలు సమకూర్చగా, నకాష్ అజీజ్ ఆలపించారు. ఈ చిత్రంలో రామ్‌చరణ్ సరసన కియారా అద్వానీ కథానాయికగా నటిస్తున్నారు. దిల్‌రాజు-శిరీష్ నిర్మిస్తున్నారు. సినిమాటోగ్రఫీ: తిరుణావుక్కరుసు

శివరాత్రి పాట చిత్రీకరణలో



నాగచైతన్య, సాయిపల్లవి జంటగా రూపొందుతున్న చిత్రం 'తండేల్'. చందూ మొండేటి దర్శకుడు. అల్లు అరవింద్ సమర్పణలో బన్నీవాస్ నిర్మిస్తున్నారు. ప్రస్తుతం చిత్రీకరణ జరుగుతోంది. భారీ సెట్ వేసి అందులో నాగచైతన్య సాయిపల్లవిపై శివరాత్రి నేపథ్యంలో సాగే గీతాన్ని తెరకెక్కిస్తున్నారు. ఈ సందర్భంగా పాట చిత్రీకరణకు సంబంధించిన రెండు పోస్టర్స్‌ను చిత్ర బృందం సోమవారం విడుదల చేసింది. శివ పార్వతులను తలపించేలా నర్తిస్తున్న నాగచైతన్య, సాయిపల్లవి జంట ఆకట్టుకుంది. ఈ చిత్రానికి సంగీతం: దేవి శ్రీ ప్రసాద్. సినిమాటోగ్రఫీ: షామ్‌దత్.

కమిటీ కుర్రోళ్లు యాభై రోజుల వేడుక



నిహారిక కొణిదెల సమర్పణలో ఫణి అడపాక నిర్మించిన 'కమిటీ కుర్రోళ్లు' చిత్రం యాభై రోజుల వేడుక సోమవారం ప్రసాద్ ప్రివ్యూ థియేటర్‌లో జరిగింది. సీనియర్ నటీనటులతో పాటు పదకొండు మంది హీరోలు, నలుగురు హీరోయిన్లను పరిచయం చేస్తూ నిర్మించిన ఈ చిత్రానికి యదు వంశీ దర్శకత్వం వహించారు. ఈ వేడుకకు నాగబాబు, దిల్ రాజు ముఖ్య అతిథులుగా హాజరైన యూనిట్ సభ్యులకు జ్ఞాపికలు అందజేశారు. ఈ రోజుల్లో ఒక సినిమా 50 రోజులు పూర్తి చేసుకోవడం అరుదనీ, 'కమిటీ కుర్రోళ్లు' చిత్రం ఆ రికార్డ్ సాధించినందుకు అతిథులు అభినందించారు.

ఇన్ ప్రోగ్రెస్

దసరాకు వస్తున్న రాజావారు




నార్నే నితిన్ హీరోగా సతీశ్ వేగేశ్న దర్శకత్వంలో రూపుదిద్దుకున్న 'శ్రీశ్రీశ్రీ రాజావారు' చిత్రం దసరాకు విడుదల కానుంది. లవ్, ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా రూపుదిద్దుకున్న ఈ చిత్రంలో సంపద హీరోయిన్. ఈ టీజర్‌ను దర్శకుడు వంశీ పైడిపల్లి విడుదల చేసి, టీమ్‌కు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా చిత్ర నిర్మాత చింతపల్లి రామారావు మాట్లాడుతూ 'నార్నే నితిన్ నటిస్తున్న మరో మంచి సినిమా 'శ్రీశ్రీశ్రీ రాజావారు', దసరాకు విడుదల చేస్తున్నాం' అన్నారు.

పరిష్కారం చూపే ప్రయత్నం



'మంత్ర' ఫేం ఓషో తులసీరామ్ దర్శకత్వంలో తెరకెక్కిన హారర్ థ్రిల్లర్ 'దక్షిణ'. సాయిధన్సిక లీడ్‌రోల్ పోషించారు. ఈ నెల 4న ఈ చిత్రం విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్రబృందం నిర్వహించిన ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో తులసీరామ్ మాట్లాడుతూ 'ఇదొక సూపర్ థ్రిల్లర్. సమాజంలో అమ్మాయిలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రస్తావిస్తూ, వాటికి పరిష్కారం చూపే ప్రయత్నం చేశాం' అన్నారు. సినిమా ఆసక్తికరంగా ఉంటుంది, అన్ని వర్గాల ప్రేక్షకులను అలరిస్తుందని సాయిధన్సిక చెప్పారు.

పవన్‌ను విమర్శించేవాళ్లు సూడో సెక్యులరిస్టులు



నాగబాబు

'పవన్ కల్యాణ్ అసలైన సెక్యులరిస్ట్. ఆయన్ను విమర్శించేవాళ్లంతా సూడో సెక్యులరిస్టులు' అని నటుడు నాగబాబు ఘాటు వ్యాఖ్యలు చేశారు. సోమవారం ఓ ప్రైవేట్ కార్యక్రమంలో పాల్గొన్న నాగబాబు తిరుమల లడ్డూ కల్తీ వివాదంపై స్పందించారు. 'వైకాపా నాయకుల విమర్శలకు సమాధానం చెప్పాల్సిన అవసరం లేదు. లడ్డూ కల్తీకి పాల్పడిన వారు ఎవరనేది విచారణలో తేలుతుంది. ప్రభుత్వాల అవినీతి వల్ల హిందూ ధర్మానికి ఆపద వాటిల్లుతోంది అనేదే పవన్ ఆవేదన. తిరుమల లడ్డూ కల్తీ వ్యవహారంతో హిందూ ధర్మంపై జరుగుతున్న కుట్రలు పతాక స్థాయికి చేరాయి. హిందూ ధర్మ రక్షణ మండలి ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది' అని నాగబాబు అన్నారు. ప్రాయశ్చిత్త దీక్ష చేపట్టిన తెలుగు రాష్ట్రాల్లోని శ్రీవారి భక్తులకు మద్దతుగా సంగీత దర్శకుడు కీరవాణి 'ఓం నమో నారాయణాయ' పేరుతో ఓ ఆడియో రికార్డును విడుదల చేశారు. ఈ నేపథ్యంలో పవన్ కల్యాణ్ ఓ ప్రకటనలో కీరవాణికి, ఆయన బృందానికి అభినందనలు తెలిపారు.

దేవుణ్ణి రాజకీయాల్లోకి లాగొద్దు : ప్రకాశ్‌రాజ్

తిరుమల లడ్డూ ప్రసాదం కల్తీ అంశం వెలుగులోకి వచ్చినప్పటి నుంచి వరుస ట్వీట్లతో తన అభిప్రాయాలను తెలుపుతూ వార్తల్లో నిలుస్తున్నారు నటుడు ప్రకాశ్‌రాజ్. లడ్డూ కల్తీ అంశంపై విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు వ్యాఖ్యల నేపథ్యంలో ప్రకాశ్ రాజ్ మరోసారి సోషల్ మీడియా వేదికగా 'జస్ట్ ఆస్కింగ్' అంటూ తనదైన శైలిలో స్పందించారు. 'దేవుణ్ణి రాజకీయాల్లోకి లాగకండి' అంటూ దండం పెడుతున్న ఎమోజీలను ఆయన పోస్ట్ చేశారు.

సిస్టర్ సెంటిమెంట్‌తో



రామ్ మిట్టకంటి, పవిత్ర, కస్వీ ప్రధాన పాత్రలు పోషించిన 'చిట్టి-పొట్టి' చిత్రం ట్రైలర్‌ను యూనిట్ విడుదల చేసింది. భాస్కర్ యాదవ్ దాసరి స్వీయ దర్శకత్వంలో నిర్మించిన సినిమా ఇది. ఈ సందర్భంగా దర్శకనిర్మాత మాట్లాడుతూ 'అన్నా చెల్లెలు అనుబంధం కథాంశంగా రూపుదిద్దుకున్న సినిమా ఇది. చెల్లెలుగా, మేనత్తగా, చివరికి బామ్మగా .. ఓ మహిళ జీవితంలోని ఎమోషనల్ జర్నీని ఇందులో చూపించాం. అక్టోబర్ 3న విడుదల చేస్తున్నాం' అని చెప్పారు.

వినోదం ప్లస్ సందేశం



సాయిరోనక్, ప్రగ్యా నగ్రా జంటగా నటించిన చిత్రం 'లగ్గం'. రాజేంద్రప్రసాద్ కీలకపాత్ర పోషించారు. రమేశ్ చెప్పాల దర్శకత్వంలో వేణుగోపాల్ రెడ్డి నిర్మించారు. ఈ చిత్రం విడుదల తేదీ ఖరారైంది. అక్టోబర్ 25న ప్రేక్షకుల ముందుకొస్తోంది. హీరో సుధీర్‌బాబు ఈ చిత్రం రిలీజ్ డేట్ పోస్టర్‌ను ఆవిష్కరించి, సినిమా ఘన విజయం సాధించాలని ఆకాంక్షించారు. పెళ్లి నేపథ్యంలో వినోదంతో పాటు చక్కని సందేశంతో తెరకెక్కిన చిత్రమిదని దర్శకుడు తెలిపారు. సంగీతం: మణిశర్మ, చరణ్ అర్జున్, సినిమాటోగ్రఫీ: బాల్‌రెడ్డి

ముగింపు మెప్పిస్తుంది



నోయల్, రిషిత నెల్లూరు జంటగా నటించిన 'బహిర్భూమి' చిత్రం ఈ నెల నాలుగున విడుదల కానుంది. రామ్‌ప్రసాద్ కొండూరు దర్శకత్వంలో మచ్చ వేణుమాధవ్ నిర్మించారు. ఈ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో నిర్మాత మాట్లాడుతూ 'న్యూయార్క్ టైమ్స్ స్క్వేర్ బిల్ బోర్డ్ మీద మీ సినిమా ట్రైలర్‌ను డిస్ ప్లే చేస్తున్నాం. తెలుగులో విడుదల చేసిన తర్వాత మిగిలిన భాషల్లో రిలీజ్ చేస్తాం' అని చెప్పారు. బహిర్భూమి అనే టైటిల్ ఎందుకు పెట్టామో సినిమా చూస్తే అర్థమవుతుందని దర్శకుడు చెప్పారు. ఈ సినిమా ముగింపు ప్రేక్షకులను మెప్పిస్తుందని నోయల్ చెప్పారు.

కొత్త కాన్సెప్ట్



సుగి విజయ్, జుహీ భద్ర హీరోహీరోయిన్లుగా నటిస్తున్న 'ఐ హేట్ మ్యారేజ్' చిత్రం షూటింగ్ సోమవారం హైదరాబాద్‌లో మొదలైంది. పరమేశ్ రేణుకుంట్ల దర్శకత్వంలో ఎం. దయానంద్ నిర్మిస్తున్నారు. నేటి యువతరంతో పాటు కుటుంబ సభ్యులకు నచ్చే భావోద్వేగాలతో ఈ సినిమా ఉంటుందనీ, యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్‌గా సినిమా ఉంటుందనీ దర్శకుడు చెప్పారు. నిర్మాత మాట్లాడుతూ 'రొటీన్‌కు భిన్నంగా కొత్త కాన్సెప్ట్‌తో చిత్రాన్ని తీస్తున్నాం. డిసెంబర్ వరకూ ఏకధాటిగా జరిగే షూటింగ్‌తో చిత్రం పూర్తవుతుంది' అని చెప్పారు.

కలి స్ఫూర్తిగా



జీవితంలో ఎదురయ్యే సమస్యలకు ఆత్మహత్యలు పరిష్కారం కాదు అనే అంశాన్ని 'కలి' చిత్రంలో చూపించబోతున్నాం. కలి పురుషుడి పాత్రను స్ఫూర్తిగా తీసుకొని ఈ చిత్రం తెరకెక్కించాను' అని దర్శకుడు శివశేషు అన్నారు. ప్రిన్స్, నరేశ్ అగస్త్య హీరోలుగా నటించిన ఈ చిత్రం ఈ నెల 4న విడుదలవుతోంది. ఈ సందర్భంగా శివశేషు సినిమా విశేషాలను మీడియాతో పంచుకున్నారు. 'సమయాన్ని, ఆత్మను ఆధారంగా చేసుకొని కలి ఈ యుగాన్ని ఎలా ప్రభావితం చేస్తున్నాడు అనేది ఆసక్తికరంగా చూపించాం. ఇందులో మంచి ప్రేమకథ కూడా ఉంది. వీఎఫ్ఎక్స్ మా సినిమాకు ప్రత్యేకాకర్షణ' అని చెప్పారు.

వినతులకు కచ్చితమైన సమాధానం ఇవ్వాలి

● కలెక్టరు అంబేడ్కర్

● గ్రీవెన్‌కు వివిధ సమస్యలపై 221 ఫిర్యాదులు

కలెక్టరేట్: ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చిన వినతులకు నాణ్యమైన, కచ్చితమైన సమాధానాలు ఇవ్వాలని, రీ ఓపెన్ చేసే పరిస్థితి లేకుండా చూడాలని కలెక్టర్ అంబేడ్కర్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో గ్రీవెన్స్‌పై అధికారులతో ఆయన మాట్లాడారు. వినతులు వచ్చిన రోజే అధికారులు ఓపెన్ చేయాలని, వినతులను పూర్తిగా చదివి అర్థం చేసుకుని అడిగిన దానికి సరిపోయే సమాధానం ఇవ్వాలని సూచించారు. వినతుల పరిష్కారంలో నిర్లక్ష్యంగా ఉంటే సహించేది లేదన్నారు. ఎక్కువగా రెవెన్యూకు సంబంధించిన వినతులు వస్తున్నాయని, ఈ విషయంలో తహసీల్దార్లు జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో భాగంగా మండల, జిల్లా స్థాయి అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినతులు అసంపూర్తి సమాధానం ఇచ్చిన సంబంధం లేని సమాధానాలు ఇచ్చినా, గడువు దాటిన తర్వాత స్పందించినా, తప్పుడు లేదా తప్పుదారి పట్టించేలా సమాధానాలు ఇచ్చినా ఆయా శాఖ అధికారులపై చర్యలు తప్పవన్నారు.

గ్రీవెన్స్‌లో 221 వినతులు

వివిధ సమస్యలపై జిల్లా వ్యాప్తంగా 221 వినతులు వచ్చాయి. వీటిలో రెవెన్యూకు సంబంధించి 151, డీఆర్‌డీఏ 18, మున్సిపాల్టీకి 14, పంచాయతీరాజ్ 12, విద్యాశాఖ 8 వినతులు వచ్చాయి. వీటిని కలెక్టర్ అంబేడ్కర్, జేసీ సేతు మాధవన్, డీఆర్వో అనిత వినతులు స్వీకరించారు.

● ప్రభుత్వ మద్యం దుకాణంలో పని చేస్తున్న సూపర్‌వైజర్లు, సేల్స్ మెన్‌కు ఉద్యోగ భద్రత కల్పించాలని ఏపీఎస్‌బీసీఎల్ జిల్లా అధ్యక్షుడు సుంకరి రామకృష్ణ డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం తీసుకుని వచ్చిన ప్రైవేటు పాలసీకి మేము వ్యతిరేకంగా కాదని, రాష్ట్ర వ్యాప్తంగా 15000 మంది రోడ్డున పడతారని ఆవేదన వ్యక్తం చేశారు.

● విజయనగ రం పట్టణంలో నిరాశ్రయుల అతిథి గృహం ఏర్పాటుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలని టీడీపీ నియోజకవర్గం నాయకులు సోమవారం కలెక్ట రుకు వినతి పత్రం సమర్పించారు. కోరారు. కార్యక్రమంలో కనకల మురళీ మోహన్, చంద్రశేఖర్ తదితరులు ఉన్నారు.

● విజయనగరం పట్టణంలోని ధర్మపురి పరిధిలోగల రైల్వే కోఆపరేటివ్ సొసైటీ వారు వేసిన లేఅవుట్‌లో 2011లో ఇంటి స్థలాన్ని కొనుగోలు చేశాం. అప్పటి నుంచి తమ అధీనంలోనే స్థలం ఉంది. దీనిలో ఒక షెడ్డు నిర్మించుకున్నాం. అయితే జిల్లాకు చెందిన మాజీ మంత్రి సోదరుడు, ఆయన కుమారుడు కలిసి తన స్థలంలో ఉన్న షెడ్డుకు అనుకుని నా అనుమతి లేకుండా షెడ్డు నిర్మించి మెటీరియల్ వేసుకున్నారని రిటైర్డ్ తహసీల్దార్ డొంకాడ హరిహరిరావు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై వెంటనే విచారణ చేసిన న్యాయం చేయాలని ఆయన కోరారు.



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ అంబేడ్కర్

రోడ్డు ప్రమాదంలో మిమ్స్ ఉద్యోగి మృతి



శ్యామ్‌కుమార్ (ఫైల్)

గుర్ల/నెల్లిమర్ల: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. దీనికి సంబంధించి స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నెల్లిమర్లకు చెందిన సింగరోతు శ్యామ్‌కుమార్(40) మిమ్స్ వైద్య కళాశా లలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం తన భార్యతో కలిసి రాజాంలోని అత్తవారింటికి వెళ్లాడు. తిరిగి సోమవారం ఉదయం ఉద్యోగ నిమిత్తం నెల్లిమర్లలో మిమ్స్ కళాశాలకు బయలుదేరాడు. మరి కాసేపట్లో చేరుకుంటాడనగా గుర్ల మండలం ఎస్ఎస్ఆర్‌పేటకు వచ్చేసరికి నెలిమర్ల నుంచి కెల్ల వైపు వెళ్తున్న కారు ఎదురుగా వచ్చి బలంగా ఢీకొంది. ఈ ఘటనలో శ్యామ్‌కుమార్ తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు వెంటనే 108కి ఫోన్ చేయగా ఆ వాహనం వచ్చే లోపే శ్యామ్‌కుమార్ మృతి చెందాడు. మృతదేహాన్ని చీపురుపల్లి ఆసుపత్రికి తరలించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు. నెలిమర్ల గ్రామం కీర్తి వీధికి చెందిన శ్యామ్ కుమార్‌కు రెండు సంవత్సరాల క్రితమే శిరీషతో వివాహమైంది. తండ్రి కొద్ది రోజుల క్రితమే చనిపోయాడు. దీంతో అమ్మను, ఇద్దరు అక్కలను, భార్యను తానే పోషిస్తూ కుటుంబ భారం మోస్తున్నాడు. ఇలాంటి సమయంలో పెద్దదిక్కు కోల్పోవడంతో కుటుంబమంతా తీవ్ర విషాదంలో మునిగిపోయింది.

చికిత్స పొందుతూ ఒకరు..



శంకరరావు (ఫైల్)

రేగిడి: మండలంలోని పెద్దశిర్లాం గ్రామానికి చెందిన చెరికూరి శంకరరావు(50) సోమవారం చికిత్సపొందుతూ మృతి చెందాడు. స్థానికుల కథనం మేర కు.. పెద్దశిర్లాం గ్రామానికి చెందిన చెరికూరి శంకరరావు టింపర్‌డిపోలో కార్మికు డిగా, గ్రామంలో కార్పెంటర్‌గా పనిచేస్తుంటాడు. ఇటీవల అనారోగ్యానికి గురయ్యాడు. ఈనేపథ్యంలో గతనెల 27 రాత్రి పెద్దశిర్లాం ఊరు శివార్లో పురుగులు మందుతాగాడు. అపస్మారకస్థితిలో ఉన్న శంకరరావును అదేరోజు కుటుంబ సభ్యులు రాజాం ఆసుపత్రికి చేర్పించగా, పరిస్థితి విషమంగా ఉండడంతో శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. అక్కడ సోమవారం మధ్యాహ్నం చికిత్స పొందు తూ మృతిచెందాడు. శంకరరావుకు భార్య రుక్మిణి, కుమార్తె చరిష్మ ఉన్నారు. ఈ ఘటనపై సమచారం అందినట్లు ఏఎస్ఐ రాజారావు తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుమేరకు కేసు నమోదుచేస్తామని, మంగళవారం పోస్టుమార్టం చేస్తామని చెప్పారు.

నగరపాలక సంస్థకు ఐదు వినతులు

విజయనగరం రింగురోడ్డు: నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కారవేదికలో పలువురు తమ సమస్యలను వినతుల రూపంలో కమిషనర్ నల్లనయ్యకు అందజేశారు. మొత్తంగా ఐదు వినతులు వచ్చాయి. వాటిలో ప్రణాళిక విభాగానికి సంబంధించి రెండు, ఇంజినీరింగు విభాగానికి సంబంధించి మూడు వినతులు వచ్చాయి. ప్ర జల నుంచి వచ్చిన వినతుల పరిష్కారం దిశగా కృషి చేయాలని కమిషనర్ నల్లనయ్య ఆదేశించారు. ఈఈ శ్రీనివాసరావు, ప్రజారోగ్య అధికారి డాక్టరు కొండపల్లి సాంబమూర్తి, అసిస్టెంట్ సిటీ ప్లానర్ రమణమూర్తి, మేనేజరు ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో కుల వివక్ష ఉండకూడదు

కొత్తవలస: గ్రామంలో ఎటువంటి కుల వివక్ష లేకుండా అందరూ కలసి మెలసి జీవనం సాగించాలని తహసీల్దార్ బి.నీలకంఠారావు తెలిపారు. సోమవారం పౌర హక్కుల దినం సందర్భంగా కొత్తవలస ఎస్సీ కాలనీలో కుల వివక్షపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కాఫీ, టీ దుకాణాల్లో రెండు గ్లాసుల సంస్కృతి ఉండకూడదన్నారు. కొత్తవలస సర్పంచ్ రామస్వామి, డీటీ రమేష్, వీఆర్వో రామానుజం, ఏఎస్ఐ ప్రకాష్, వార్డు మెంబర్ బోని కుమారి పాల్గొన్నారు.

రూ.18 వేల బేసిక్‌పై బోనస్ ఇవ్వాలి

కొత్తవలస: రైల్వేకార్మికులకు 7వ వేతన సంఘం బేసిక్ పై రూ. 18 వేల ఆధారంగా బోనస్ వెంటనే ప్రకటించాలని ఆలిండియా ఓబీసీ రైల్వే ఎంప్లాయీస్ ప్రధాన కార్యదర్శి పి. రాజశేఖర్ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన కొత్తవలస వచ్చిన సందర్భంగా మాట్లాడుతూ రైల్వేలో పని చేస్తున్న లక్షలాది మంది కార్మికులు నిరంతరం రైల్వే అభివృద్ధి కోసం పని చేస్తున్నారన్నారు. రవాణా పరంగా కోట్లాది రూపాయలను రైల్వే ఆదాయంగా సమకూర్చుకుంటోందన్నారు. 16 సంవత్సరాల కిందటి 6వ వేతన సంఘంపై కాకుండా 7 వ వేతన సంఘం బేసిక్‌పై బోనస్ చెల్లించాలన్నారు.

ఎస్.కోట జలవనరుల శాఖ డీఈగా చరణ్

శృంగవరపుకోట: శృంగవరపుకోట జలవనరుల శాఖ డీఈగా చరణ్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయనను నియోజకవర్గ పరిధిలోని మండలాల జలవనరుల శాఖ జేఈలు మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందనలు తెలిపారు.

కంటి వైద్యునికి సన్మానం

బొబ్బిలి రూరల్: బొబ్బిలికి చెందిన కంటి వైద్య నిపుణుడు కేవీ అప్పారావును రోటరీ క్లబ్ జిల్లా చైర్మన్, క్లబ్ అధ్యక్షుడు శ్రీనివాసన్, సర్వీస్ ప్రాజెక్టర్ గెంబలి శ్రీనివాసరావు సోమవారం సన్మానించారు. ఈ సందర్భంగా శ్రీనివాసన్ మాట్లాడుతూ గత నెల 24, 25, 26 తేదీల్లో తిరుపతిలో జాతీయ స్థాయిలో నిర్వహించిన ఆప్తమాలజిస్ట్ సెమినార్‌లో పాల్గొని కంటి సమస్యలు-చికిత్స అధునాతన పోకడలు అన్న అంశంపై ప్రసంగించారని తెలిపారు. ఎం. శ్రీనివాసరావు, జేసీ రాజు, పాల్గొన్నారు.

ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈగా ఢిల్లేశ్వరరావు

బొబ్బిలి రూరల్: బొబ్బిలిలో ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈగా ఢిల్లేశ్వరరావు సోమవారం బాధ్యతలు స్వీక రించారు. ఆయన పీఎంకే రెడ్డి స్థానంలో పాలకొండ డివిజన్ నుంచి బదిలీపై వచ్చారు. కాగా ఇప్పటి వరకు డీఈఈగా పనిచేసిన పీఎంకే రెడ్డి సాలూరు బదిలీపై వెళ్లారు.

గుడ్ టచ్-బ్యాడ్ టచ్‌పై అవగాహన

బొబ్బిలి రూరల్: మండలంలోని నారశింహునిపేట జడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం హెచ్‌ఎం ఎస్.రామారావు ఆధ్వర్యంలో వన్ స్టాప్ సెంటర్ సిబ్బంది టి.అనూష (కేస్ వర్కర్) గుడ్ టచ్ - బాడ్ టచ్, డ్రెస్ కోడ్, బాల్యవివాహాలు, చైల్డ్ రైట్స్‌పై అవగాహన కల్పించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఏఎంసీ మాజీ చైర్మన్ కుటుంబానికి బొత్స పరామర్శ

బొబ్బిలి రూరల్: మండలంలోని పారాదిలో ఏఎంసీ మాజీ చైర్మన్ అల్లాడ కృష్ణ కుటుంబ సభ్యులను వైసీపీ సీనియర్ నాయకుడు, ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ సోమవారం పరామర్శించారు. కార్యక్రమంలో జడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు, బొబ్బిలి మునిసిపల్ కోఆప్షన్ సభ్యుడు రియాజ్ ఖాన్ పాల్గొన్నారు.

ఆక్రమణలపై చర్యలు తీసుకోండి

శృంగవరపుకోట: శృంగవరపుకోట పుణ్యగిరి రోడ్డులో జగనన్న కాలనీకి ఆనుకుని ఉన్న ప్రభుత్వ భూమిని ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని జనసేన నాయకులు వి.సురేష్ రాజు, తాండ్రంగి చంటి, మోపాడ చిన్ని, గంధవరపు సతీష్ డిమాండ్ చేశారు. తహసీల్దార్ అరుణకుమారికి వినతిపత్రం అం దించారు. విశాఖ-అరకు రోడ్డులో ఓ ప్రైవేటు కళాశాల వద్ద ప్రభుత్వ భూమిని ఆక్రమించారని తెలిపారు.

ఓం సదనంలో రుద్రహోమం

కొత్తవలస: భాద్రపద మాస మాస శివరాత్రి సందర్భంగా మండలంలోని తుమ్మికాపల్లి పంచాయతీ గేట్ సమీపంలోని ఓం సదనంలో సోమవారం 108 శివలింగాలకు మహాన్యాసపూర్వక రుద్రహోమం నిర్వహించారు. 108 శివలింగాలకు రుద్రా భిషేకాలు చేశారు. సదనం నిర్వాహకుడు అంపోలు ఉమామహేశ్వర శర్మ ఆధ్వర్యంలో కిరణ్ కుమార్ శర్మ చేశారు.

మద్యం షాపుల సిబ్బంది ధర్నా

రామభద్రపురం: తమకు న్యాయంచేయాలని ప్రభుత్వ మద్యం షాపుల్లో పనిచేస్తున్న సిబ్బంది కోరారు. ఈ మేరకు సోమవారం రామభద్రపురంలో సూపర్‌వైజర్లు, సేల్స్‌మెన్లు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యోగుల ప్రతినిధి చొక్కాపు చినరామా మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రభుత్వం కొత్తగా మద్యంపాలసీ తేవడంతో తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు.

బాధితుల సమస్యలు తక్షణమే పరిష్కరించాలి

● డీఎస్పీ శ్రీనివాసరావు

విజయనగరం క్రైం, సెప్టెంబరు 30: పోలీసు స్టేషన్‌ల పరిధిలో ఫిర్యాదుదారు అందించే సమస్యలను తక్షణమే చట్ట పరిధిలో పరిష్కరించాలని విజయనగరం డీఎస్పీ శ్రీనివాసరావు ఆదేశించారు. సోమవారం ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాలతో జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించి, 54 ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, స్వీకరించిన ఫిర్యాదుల్లో భూ తగాదాలకు సంబంధించి 18, కుటుంబ తగాదాలకు సంబంధించి 4, మోసాలకు పాల్పడినట్టుగా 10 ఫిర్యాదులు, ఇతర విషయాలకు సంబంధించి 22 ఫిర్యాదులు ఉన్నాయన్నారు. సంబంధిత అధికారులు ఫిర్యాదు అంశాలను పరిశీలించాలని, వాటి పూర్వాపరాలను విచారణ చేసి వాస్తవమైతే, చట్ట పరిధిలో చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించామన్నారు. ఫిర్యాదులపై తీసుకున్న చర్యల వివ రాలను పరిష్కరించి ఏడు రోజుల్లో జిల్లా పోలీసు కార్యాల యానికి నివేదికను అందించాలని అధికారులను ఆదేశించారు. డీసీఆర్‌బీ ఎస్ఐలు వాసుదేవ్, రాజేష్, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది ఉన్నారు.



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న డీఎస్పీ

డ్రగ్స్ వలలో చిక్కుకోవద్దు

● సినీనటుడు సాయికుమార్ పిలుపు

బొబ్బిలి: డ్రగ్స్ బారి నుంచి యువకులను రక్షించాలని సినీనటుడు సాయి కుమార్ పిలుపునిచ్చారు. సోమవారం బొబ్బిలిలో ఎస్పీ వకుల్ జిందాల్ ఆధ్వర్యంలో పోలీసు శాఖ ఆధ్వర్యంలో సంకల్పం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రగ్స్ వినియోగం ఉచ్చులో చిక్కుకున్న వారు అథపాతాళానికి వెళ్లిపోకుండా రక్షించుకోవాలన్నారు. సైనికులు త్యాగాలకు ఓర్చుతూ మనల్ని కాపాడుకుంటున్నారని, వారే రియల్ పోలీసులన్నారు. ప్రతి విద్యార్థి లక్ష్యాలను నిర్దేశించుకొని వాటి సాధన కోసం పరితపించాలని సూచించారు. ఎస్పీ వకుల్ జిందాల్ మాట్లాడుతూ యువత డ్రగ్స్ వినియోగానికి బానిసల వుతున్న విషయాన్ని గమి నించి సమరానికి శంఖారావం పూరించామని తెలిపారు. డ్రగ్స్ వినియోగం వల్ల జరిగే నష్టాలను వివరించారు. ప్రతి కళాశాలలో డ్రగ్స్ వ్యతిరేక కమిటీలను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు.డ్రగ్స్‌కు బానిసలైన వారిని డీఅడిక్షన్ సెంటర్‌కు పంపించి వారిని రక్షిస్తామని తెలిపారు. తొలుత విద్యార్థులతో బొబ్బిలిలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం విద్యార్థులు, అధికారులు, సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. బొబ్బిలి, చీపురుపల్లి డీఎస్పీలు పి.శ్రీనివాసరావు, రాఘవులు, సీఐ కటకం సతీష్‌కు మార్, రౌతు వాసుదేవరావు, తూముల కార్తీక్ పాల్గొన్నారు.

● సినీరంగంలో అత్యధిక సంఖ్యలో పోలీసు అధికారి పాత్రలు ధరించిన నేపథ్యంలో భవిష్యత్‌లో గిన్నీస్ బుక్ ఎక్కుతానేమోనని సినీనటుడు సాయికుమార్ తెలిపారు. సోమవారం బొబ్బిలిలో విలేకరులతో మాట్లాడుతూ పోలీసు అధికారి అవ్వాలన్న తన కోరిక నేరవేరలేదని, రియల్ పోలీసు కాలేక, రీల్ పోలీసునయ్యానన్నారు. పోలీసు పాత్రలు తనకు చాలా పేరు తెచ్చిపెట్టాయన్నారు. సినిమాలకు ఎంతో ఉపయోగపడే గొంతు తన తల్లిదండ్రుల నుంచి సంక్రమించిందన్నారు. పదేళ్ల వయస్సులోనే తన సినీఅరంగేట్రం జరిగిందన్నారు. పోలీసు, డాక్టర్, క్రికెటర్ కావాలనుకున్నా కాలేకపోయానన్నారు. బొబ్బిలిలో తన కుమారుడు ఆదితో సహా వచ్చి మంచి కార్యక్రమంలో పాల్గొంటానని సాయికుమార్ తెలిపారు.



ప్రతిజ్ఞ చేస్తున్న సాయికమార్, పోలీసులు

ఆదర్శప్రాయుడు శ్రీరాముడు

విజయనగరం రింగురోడ్డు: శ్రీరాముడు ఆదర్శప్రాయుడని ప్రజలంతా ఆయన అడుగుజాడల్లో నడవాలని సినీనటుడు సాయికుమార్ అన్నారు. ఆదివారం రాత్రి రామనారాయణంలో శంఖారావం పేరుతో వాల్మీకి రామాయణంపై జరుగుతున్న మహాసదస్సు ముగిసింది. ఈ కార్యక్రమానికి హాజరైన సినీనటుడు సాయికుమార్ మాట్లాడుతూ వింటే రామాయాణం, చూస్తే రామనారాయణం చూడాలన్నారు. బృహత్ దివ్య సహస్రావధాని మాడుగుల నాగఫణిశర్మ, జీఎస్సార్ కృష్ణమూర్తి, అంతర్వేది కృష్ణామాచార్య స్వామి, సంతోష్‌కుమార్ ప్రణావానందదాస్ ఆశీస్ తదితరులు రామనారాయణంలో విలువలను వివరించారు. అనంతరం నిర్వహకులు అతిథులను సత్కరించారు.

గర్జించిన మహిళా లోకం



ర్యాలీ నిర్వహిస్తున్న మహిళలు

విజయనగరం రింగురోడ్డు: వాజీ చానల్, మహిళా గర్జన కమిటీ సంయుక్తంగా ఆదివారం నిర్వహించిన మహిళా గర్జన కార్యక్రమం విజయ వంతమైంది. మహిళలపై జరుగుతున్న దాడులను ప్రతిఘటిస్తూ నినా దాలతో, మహిళాలోకం స్థానిక కోట వద్ద నుంచి భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పాల్గొన్న ఎమ్మెల్యే అదితి గజపతి రాజు, కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్, మాట్లాడుతూ శిక్షణ కఠినంగా ఉండాలని అప్పుడే తప్పులు చేయడానికి భయపడతారన్నారు. బాధితులకు సత్వరమే న్యాయం జరగాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రభుత్వం మహిళా రక్షణకు ప్రత్యేక చట్టాలు రూపొందించిందన్నారు. వాజీ చానల్ ఎండీ గణపతి నీడి శ్రీనివాసరావు, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కాపు గంటి ప్రకాష్, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్‌పర్సన్ గోటేటి హిమబిందు, పలు స్వ చ్ఛంద సంస్థల ప్రతినిధులు, మహిళా గర్జన కమిటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

ఆసుపత్రుల్లో సీనియర్ సిటిజన్లకు ప్రత్యేక ఓపీ కౌంటర్లు

కలెక్టరేట్: జిల్లా కేంద్రంలోని ఆసుపత్రిలో, ఏరియా ఆసుపత్రుల్లో వయోవృద్ధులకు ప్రత్యేక ఓపీ కౌంటర్ ఏర్పాటు చేయాలని కలెక్టర్ అంబేడ్కర్ ఆదేశించారు. ఈ ప్రత్యేక కౌంటరు మంగళవారం నుంచి ఏర్పాటు చేయా లన్నారు. ఇది ఇలా ఉంటే జిల్లాలో కేంద్రాల హేతుబద్ధీకరణకు 8 పో లింగ్ కేంద్రాల మార్పునకు ప్రతిపాదిస్తున్నట్లు కలెక్టరు అంబేడ్కర్ తెలిపారు.

ఆర్థికంగా వెనుకబడిన వారిని ఆదుకుంటాం: కోండ్రు



చెక్కును అందజేస్తున్న కోండ్రు

రాజాం/రూరల్: ఆర్థి కంగా వెనుకబడిన వారితో పాటు అనారోగ్యం బారిన పడినవారికి టీడీపీ ప్రభు త్వం అండగా ఉండి ఆదుకుంటుందని రాజాం ఎమ్మెల్యే కోండ్రు మురళీ మోహన్ తెలిపారు. సోమవారం శ్యాంపురంలోని క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన మొత్తానికి సంబంధించిన చెక్కులను పంపిణీ చేశారు. అనారోగ్యంతో బాధపడుతూ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రేగిడి మండలం బూరాడ గ్రామానికి చెందిన వావిలపల్లి రామారావుకు రూ.50 వేలు, ప్రమాదవశాత్తూ మృతి చెందిన రాజాంకు చెందిన సలాది అర్జునరావుకు మంజూరైన రూ.1,38,141 చెక్కును మృతుడి భార్య రమ్యకు అందజేశారు. కిమిడి అశోక్‌కుమార్, పిన్నింటి మోహన్‌రావు, దూబ ధర్మారావు, నాగభూషణరావు, దుప్పలపూడి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అన్ని దేవాలయాల ప్రసాదాలపై దర్యాప్తు చేయాలి

కలెక్టరేట్: దేవాలయాలకు ప్రభుత్వ ఆధీనంలో నుంచి విముక్తి కల్గించాలని విశ్వ హిందూ పరిషత్ ప్రతినిధులు డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. తిరుమల లడ్డు అపవిత్రతపై మాత్రమే కాకుండా రాష్ట్రంలో ఇతర దేవాలయాలు ప్రసాదాల నాణ్యతపై కూడా దర్యాప్తు చేయాలని డిమాండ్ చేశారు. దేవాలయాల సొమ్ము రాజకీయ స్వార్థ ప్రయోజనాల కోసం వాడుకోవడం ఆపాలని డిమాండ్ చేశారు. తిరుమల లడ్డు అపవిత్ర అంశంపై వెంటనే సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ జరిపించి , దోషులను కఠిన శిక్షించాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలోని విశ్వహిందూ పరిషత్ నాయకులు పోగిరి సూర్యనారాయణ, కాల్ల నాగభూషణరావు, కార్యదర్శి అప్పారావు, చలమయ్య, నాగరాజు శర్మ తదితరులు ఉన్నారు.

పాలకుల వల్ల వనరులు నిర్వీర్యం

రాజాం/ రూరల్: ఉత్తరాంధ్ర పూర్తిగా వెనుకబాటు తనానికి గురైందని, స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్ల గడిచినా పాలకుల నిర్లక్ష్యం వల్ల ఎటువంటి అభివృద్ధికి నోచుకులేక పోయిందని ఉత్తరాంధ్ర సాధన సమితి ప్రతినిధులు కన్వీనర్, వేమిరెడ్డి లక్ష్మునాయుడు, కోకన్వీనర్ మర్రాపు ధనుంజయనాయుడు, చుక్క కూర్మినాయుడు ఆరోపించారు. సోమవారం రాజాం తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉత్త రాంధ్ర జిల్లాల్లో సరైన వనరులు ఉన్నప్పటికి పాలకుల నిర్లక్ష్యం వల్ల నిర్వీ ర్యం అవుతున్నాయన్నారు. అనంతరం తహసీల్దార్‌కు వినతి పత్రం అందజే శారు. శంకరరావు, అప్పలనాయుడు, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా అభివృద్ధిని పరుగు పెట్టించడమే లక్ష్యం

● స్వర్ణాంధ్ర 2047 దార్శనిక పత్రంపై ప్రజాభిప్రాయ సేకరణ

కలెక్టరేట్: స్వర్ణాంధ్ర-2047 దార్శనిక పత్రం రూపకల్పనలో భాగంగా వచ్చే ఐదేళ్లకు జిల్లా స్థాయి దార్శనిక పత్రం రూపకల్పన కోసం జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో సోమవారం కలెక్టర్ కార్యాలయంలో ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కలెక్టర్ అంబేడ్కర్ అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో జిల్లాకు చెందిన పలువురు శాసన సభ్యులు, కార్పొరేషన్ చైర్మన్‌లు, వివిధ రంగాల ప్రతినిధులు పాల్గొని జిల్లా అభివృద్ధిని వేగవంతం చేయడానికి పలు సూచనలు చేశారు. ఈ సదస్సులో ప్రజా ప్రతినిధులు, వివిధ రంగాల ప్రముఖులు తెలియజేసిన సూచనలు, సలహాలు పరిగణనలోకి తీసుకుని ప్రభుత్వానికి మరింత మెరుగైన రీతిలో నివేదిక రూపొందించి జిల్లా విజన్‌ను ప్రభుత్వానికి సమర్పిస్తామన్నారు. ఎంఎల్ఏలు లోకం మాధవి, కోండ్రు మురళీమోహన్ , అదిత గజపతిరాజు, మార్క్ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగారాజు తదితరులు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో జేసీ సేతుమాధవన్ తదితరులు ఉన్నారు.

తైక్వాండో పోటీల్లో ప్రథమ బహుమతి

కొత్తవలస: మలేషియాలో జరిగిన మలేషియా ఇంటర్నేషనల్ తైక్వాండో చాంపియన్ షిప్ పోటీల్లో మండలంలోని కంటకాపల్లి గ్రామానికి చెందిన ములపర్తి ప్రకాశరావు ప్రథమ స్థానం కైవసం చేసుకుని గోల్డ్ మెడల్ సాధించారు. ఈ వివరాలను ఒక ప్రకటనలో సోమవారం ఆయన తెలిపారు. ఈ నెల 27, 28, 29 తేదీల్లో జరిగిన ఈ పోటీలకు ఆంధ్రప్రదేశ్ నుంచి ఇండియా తరపున సీనియర్ వెయిట్ కేటగిరి అండర్ 80కేజీలలో ప్రకాశరావు పాల్గొన్నారు. వివిధ దేశాలకు చెందిన తైక్వాండో క్రీడాకారులతో తలపడి ఫైనల్‌లో మలేషియా క్రీడాకారుడిపై విజయం సాధించినట్టు తెలిపారు. తాను మలేషియా వెళ్లడానికి ప్రోత్సాహం అందించిన విశాఖపట్టణం 105 లయన్స్ క్లబ్ ఇంటర్నేషన్ వారికి కృతజ్ఞతలు తెలిపారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

బొబ్బిలి రూరల్: పౌష్టికాహారం తీసుకోవడం వల్ల సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని సీడీపీవో విజయలక్ష్మి తెలిపారు. సోమ వారం మెట్టవలస అంగన్‌వాడీ కేంద్రంలో పోషన్ మాసోత్స వాల ముగింపు కార్యక్రమం జరిగింది. ఉదయం 11 గంటలకు ప్రధానమంత్రి సందేశాన్ని తల్లులు, కిషోరీబాలికలకు విని పించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు పాల్గొన్నారు. ●**బాడంగి:** బాడంగి అంగన్‌వాడీ కేంద్రంలో సూపర్‌వైజర్ ఎస్‌కే గౌరమ్మ ఆధ్వర్యంలో పోషణ మాసోత్సవాల ముగింపు పురస్కరించుకుని గర్భిణులకు సామూహిక సీమంతాలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కండి రమేష్, ఎంపీటీసీ దేవరాపల్లి శ్రీనివాసరావు పాల్గొన్నారు. ●**రామభద్రపురం:** మండలంలోని బూసాయవలస లో పోషణ మహోత్సవాలు ముగింపు పురస్కరించుకని ఐసీ డీఎస్ సూపర్‌వైజర్ సూర్యకుమారి ఆధ్వర్యంలో అంగన్‌వాడీ ఉద్యోగులు, పిల్లలు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ రకాల కాయగూరలతో ప్రదర్శన ఏర్పాటుచేశారు.

● **వేపాడ:** మండలంలోని అరిగిపాలెం గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జికామేశ్వరీ ఆధ్వర్యంలో పోషణ వాటిక కార్యక్రమంలో భాగంగా అవగాహన కల్పించారు. 6 సంవత్సరాలలోపు పిల్లలకు, పోషకాహారంపై సూపర్‌వైజర్ కామేశ్వరి వివరించారు. ముఖ్య అతిదిగా పాల్గొన్న ఎంపీటీసీ రమణ మాట్లాడుతూ పౌష్టికాహారంతో ఆరోగ్యం పొందవచ్చునన్నారు. వేపాడ సెక్టార్‌లో గల బొద్దాం2, ముకుందపురం, కేజీపూడి, నీలకంఠరాజపురం సెక్టార్‌లో నల్లబిల్లి, చినగుడిపాల, బల్లంకి అంగన్వాడీ కేంద్రాల్లో పోషణ వాటిక కార్యక్రమాన్ని నిర్వహించారు. సూపర్‌వైజర్ భాగ్యవతి, అంగన్వాడీ కార్యకర్తలు, బొన్నపల్లి కనకమహాలక్ష్మి, మంగలక్ష్మి, బి.రాజేశ్వరి, నాగమణి, రమణమ్మ, పరమేశ్వరి, ఆయా కేంద్రాల ఆయాలు తదితరులు పాల్గొన్నారు.



వేపాడ: పోషణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న దృశ్యం

ఇసుక నాటు బళ్లు స్వాధీనం

శృంగవరపుకోట: మండల పరిధిలోని మామిడిపల్లి బ్రిడ్జి వద్ద ఇసుకను తవ్వుతున్న మూడు నాటు బండ్లను శృంగవరపుకోట రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. గోస్తనీ నదిలో అక్రమంగా ఇసుక తరలించడమే కాకుండా నిబంధనలకు విరుద్ధంగా బ్రిడ్జీల వద్ద ఇసుకను తవ్వేస్తున్నారని అధికారులు పేర్కొన్నారు.

అక్రమంగా ఇసుక తరలిస్తున్న వ్యక్తిపై కేసు

కొత్తవలస: ఎటువంటి అనుమతులు లేకుండా ఇసుకను ట్రాక్టర్‌లో అక్రమంగా తరలిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని ట్రాక్టర్ సీజ్ చేసినట్టు సీఐ షణ్ముఖరావు తెలిపారు. ఆదివారం సాయంత్రం కొత్తవలసలో వాహనాలను తనిఖీ చేస్తుండగా గొంప దుర్గారావు అనే వ్యక్తి ట్రాక్టర్‌లో ఇసుకను అక్రమంగా రవాణా చేయడాన్ని చూసి పట్టుకున్నారు. ఎటువంటి బిల్లులు లేవని చెప్పడంతో ట్రాక్టర్‌ను సీజ్ చేసి, దుర్గారావుపై కేసు నమోదు చేశామన్నారు.

మద్యం అక్రమ విక్రయాలపై కేసు

వేపాడ: మండలంలోని సోంపురం గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని పట్టుకుని అరెస్టు చేసినట్టు వల్లంపూడి ఎస్ఐ దేవి తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు సిబ్బందితో దాడి చేసి పట్టుకున్నట్టు ఎస్ఐ తెలిపారు. 8 మద్యం సీసాలను సీజ్ చేయడంతో పాటు మద్యం అమ్ముతున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్టు ఆమె తెలిపారు. హెచ్‌సీ శేషాద్రినాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

అనుపోత్సవంలో వివాదం..

● ఇరువర్గాల కొట్లాట

శృంగవరపుకోట: వినాయక విగ్రహాల అనుపోత్సవంతో జరిగిన గొడవలో రెండు వర్గాలకు చెందిన నలుగురు వ్యక్తులు గాయపడినట్లు సమాచారం. శృంగవరపుకోట పుణ్యగిరి రోడ్డులోని శివాలయం వద్ద ఏర్పాటు చేసిన విగ్రహాన్ని ఆదివారం రాత్రి అనుపోత్సవం సందర్భంగా ఊరేగింపు చేశారు. ఇదే విధంగా రైల్వే స్టేషన్ కాలనీలో ఏర్పాటు చేసిన వినాయకునికీ ఊరేగింపు చేపట్టారు. ఈ రెండు వినాయక విగ్రహాలు పుణ్యగిరి రోడ్డులోని రైల్వేగేటు వద్ద తారసపడ్డాయి. ఈ సమయంలో ఇరువర్గాల మధ్య మాటామాటా పెరిగి తోపులాట జరిగింది. ఈ వివాదం పోలీస్‌స్టేషన్‌కు చేరడంతో రెండు వర్గాలను సోమవారం రాత్రి పిలిపించారు. దీంతో వీరంతా స్టేషన్‌కు చేరుకున్నారు.

నన్ను వదిలేసి రెండో పెళ్లి చేసుకున్నాడు

● భర్త ఇంటిముందు బైఠాయించిన హైదరాబాద్ మహిళ



సుధాకర్ ఇంటిముందు బైఠాయించిన పరమేశ్వరి, కుటుంబ సభ్యులు

శృంగవరపుకోట రూరల్: తనను పదేళ్ల క్రితం పెళ్లిచేసుకుని కాపురం చేస్తూ ఇప్పుడు రెండో పెళ్లి చేసుకుని మోసం చేశాడని హైదరాబాద్‌కు చెందిన మహిళ ఆవేదన వ్యక్తం చేసింది. మండలంలోని పోతనాపల్లి గ్రామంలో ఉన్న తన భర్త పూడి సుధాకర్ ఇంటిముందు సోమవారం తన కుటుంబ సభ్యులతో కలిసి బైఠాయించింది. ఈ సందర్భంగా ఆమె స్థానిక విలేఖర్లకు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన పూడి సుధాకర్ హైద్రాబాద్ సీసీఎస్‌లో హోంగార్డుగా పనిచేస్తున్న సమయంలో పక్కనే ఉన్న ప్రైవేటు ఆసుపత్రిలో పనిచేస్తున్న పరమేశ్వరీ అనే మహిళను ప్రేమించి, పెద్దల సమక్షంలోనే యాదగిరి గుట్ట ఆలయంలో పెళ్లి చేసుకున్నాడు. పదేళ్ల క్రితం వివాహమైన వీరికి ఐదేళ్ల పాప ఉంది. అయితే సరిగ్గా ఏడాది క్రితం తండ్రి చనిపోయాడని చెప్పి సుధాకర్ హైద్రాబాద్ నుంచి బయలుదేరి స్వగ్రామానికి వచ్చి విశాఖపట్నంకు చెందిన మరో యువతిని పెళ్లి చేసుకున్నాడు. కొద్ది కాలం తర్వాత విషయం తెలుసుకున్న పరమేశ్వరి సుధాకర్ కుటుంబసభ్యులను ప్రశ్నిస్తే వారు హైద్రాబాద్ వచ్చి న్యాయంచేస్తామని చెప్పారు. పెద్దమనుషులతో కలిసి హైద్రాబాద్ వెళ్లిన సుధాకర్ కుటుంబ సభ్యులు న్యాయం చేయకపోవడంతో మోసపోయానని గ్రహించిన పరమేశ్వరి హైద్రాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో సుధాకర్‌పై ఎఫ్ఐఆర్ నమోదవడంతో ఉద్యోగం నుంచి తొలగించారు. ఆమెకు మద్దతుగా వచ్చిన జాతీయ మహిళ ఉపాధ్యక్షురాలు జయంతి గౌడ్ మాట్లాడుతూ ఒక దళిత మహిళను ఈ వ్యక్తి మోసంచేశాడని, న్యాయం చేయాలని లేనిపక్షంలో పోరాటం చేయడంతో పాటు రాష్ట్రహోంమంత్రి వంగలపూడి అనితకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. ఈ ఆందోళన సమయంలో సుధాకర్ కుటుంబ సభ్యులెవరూ ఇంట్లో లేరు.

విజయనగరం వాసికి తెలంగాణ డీఎస్సీలో స్టేటు ఫస్ట్

కలెక్టరేట్: తెలంగాణ డీఎస్సీలో విజయనగరం పట్టణానికి చెందిన కె.వెంకట నాగశ్రీరాం రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానం సాధించారు. సోమవారం విడుదలైన ఫలితాల్లో 100 మార్కులకు గాను 84.93 మార్కులు సాధించినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. దీంతో ఆయనను స్థానికులు, పలువురు అభినందించారు.

'సక్షం' అంగన్‌వాడీ కేంద్రాల ప్రారంభం

- ప్రత్యేకంగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం చర్యలు
- పాల్గొన్న ఎమ్మెల్యేలు, అధికారులు


గుమ్మలక్ష్మీపురం: భద్రగిరి అంగన్‌వాడీ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి


పార్వతీపురం రూరల్: పెద్దబొండపల్లిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయచంద్ర


సాలూరు రూరల్: శివరాంపురంలో సక్షం అంగన్‌వాడీ కేంద్రాన్ని ప్రారంభించిన పీడీ రాణి


పాచిపెంట: కోస్టువలస అంగన్‌వాడీ కేంద్రంలో మాట్లాడుతున్న అధికారులు

గుమ్మలక్ష్మీపురం: అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు ఇస్తున్న పౌష్టికాహారాన్ని వినియోగించుకోవాలని ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. సక్షం పథకంలో భాగంగా ఎంపికైన భద్రగిరి అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆమె సోమవారం ప్రారంభించారు. ఐసీడీఎస్ సీడీపీవో సుశీల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సర్పంచ్ బొత్తాడ గౌరీశంకరరావు, ఎంపీడీవో సాల్మన్‌రాజ్, వైస్ సర్పంచ్ కొత్తకోట కిషోర్, సూపర్‌వైజర్ శ్రీదేవి, పంచాయతీ కార్యదర్శి కిషోర్, యూనిట్ ఇన్‌చార్జి మహేశ్వర, చిన్న, ట్రైబుల్ రైట్స్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.లోవరాజు, ఐసీడీఎస్ సిబ్బంది పాల్గొన్నారు. ● **పార్వతీపురం రూరల్:** మహిళలు చైతన్యవంతులైతే ఆ ప్రాంతం, నియోజకవర్గం, రాష్ట్రం, దేశం అభివృద్ధి చెందుతాయని ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర అన్నారు. సక్షం పథకానికి ఎంపికైన పెద్దబొండపల్లిలోని అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని, మాట్లాడారు. గత ఎన్నికల్లో ఇచ్చిన మాట నిలబెట్టుకునేందుకు పెద్దబొండపల్లిలో కల్యాణ మండపం, వేంకటేశ్వర ఆలయం నిర్మాణం కోసం ప్రయత్నం చేసి విజయవంతం అయ్యామన్నారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి శ్రీనివాసరావు, సీడీపీవో శ్రీనివాసరావు, టీడీపీ మండల అధ్యక్షుడు దేవిచంద్రమౌళి, పార్టీ నాయకులు ఫకీరునాయుడు, వై.చిన్నరామ్మూర్తినాయుడు, జి.చంద్రమౌళి, చొక్కా అచ్యుత, ఎంపీటీసీ సూర్యకుమారి, స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు. ● **సాలూరు రూరల్:** శివరాంపురం అంగన్‌వాడీ కేంద్రాన్ని సక్షం అంగన్‌వాడీ కేంద్రంగా ప్రత్యేకంగా అభివృద్ధి చేయనున్నట్టు ఐసీడీఎస్ జిల్లా పీవో ఎంఎన్ రాణి తెలిపారు. ఆమె సోమవారం శివరాంపురం అంగన్‌వాడీ కేంద్రాన్ని సక్షం అంగన్‌వాడీగా ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడారు. సాలూరు మండలంలో 13 అంగన్‌వాడీ కేంద్రాలను కేంద్ర నిధులతో ప్రత్యేకంగా సక్షం అంగన్‌వాడీ కేంద్రాలుగా అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. సర్పంచ్ జరజాపు మోహనరావు, నోడల్ అధికారి రాజ్యలక్ష్మి, సీడీపీవో విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. ● **పాచిపెంట:** సక్షం అంగన్‌వాడీ కేంద్రాలుగా పాచిపెంట ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో 14 సెంటర్లను కేంద్ర ప్రభుత్వం ఎంపిక చేసిందని స్థానిక సీడీపీవో బి.అనంతలక్ష్మి తెలిపారు. జార్ఖండ్‌లో అక్కడి గవర్నర్‌తో ప్రారంభించిన కార్యక్రమాన్ని సోమవారం కోస్టువలస అంగన్‌వాడీ కేంద్రం వద్ద అంగన్‌వాడీ పిల్లలు, తల్లిదండ్రులతో సహా టీవీ ద్వారా వీక్షించారు. మక్కువ మండలంలో 8 కేంద్రాలను, పాచిపెంటలో ఆరు కేంద్రాలను ఎంపిక చేసినట్టు చెప్పారు. ఎంపిక చేసిన అంగన్‌వాడీ కేంద్రాలకు కేంద్ర ప్రభుత్వ నిధులతో టీవీ, వాటర్‌ఫిల్టర్, కుర్చీలు, టేబుల్స్, ఫ్యాన్లు, తదితర సామగ్రి మంజూరయ్యాయని తెలిపారు.

ఆటలకు ప్రాధాన్యం ఇవ్వండి: మంత్రి


హ్యాండ్ బాల్ పోటీలను ప్రారంభిస్తున్న మంత్రి

సాలూరు రూరల్: పిల్లలు మైదానంలో ఆటలు ఆడుకోవడానికి తల్లిదండ్రులు ప్రాధాన్యం ఇవ్వాలని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి సూచించారు. సాలూరు ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాల మైదానంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించే ఉమ్మడి జిల్లా స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలను ఆమె సోమవారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడారు. ఫోన్, కంప్యూటర్‌లో ఆటలు మంచివి కావన్నారు. టీడీపీ పట్టణాధ్యక్షుడు నిమ్మాది తిరుపతిరావు, శ్యాం, సాలూరు పోలీస్ సీఐ అప్పలనాయుడు, పీఈటీ, పీడీలు పాల్గొన్నారు.

ఇకపై మండలాల్లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక

ఇకపై మండలాల్లో కూడా ప్రజా సమస్యల పరిష్కర వేదిక కార్యక్రమం అమలు చేయనున్నామని మంత్రి సంధ్యారాణి తెలిపారు. సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం అనంతరం ఆమె విలేకర్లతో మాట్లాడారు. అక్టోబరు నెల నుంచి మండల స్థాయిలో ప్రజలు కోరిన రోజున ఈ కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. పట్టణంలో తాను తన ఇంటి వద్ద ప్రతిరోజూ ప్రజాదర్బార్‌ను నిర్వహిస్తున్నట్టు చెప్పారు. అవసరమైతే సాలూరు మున్సిపాల్టీలో కూడా ఈ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ఆమె వెంట సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆర్పీ భంజ్‌దేవ్ ఉన్నారు.

చురుగ్గా విద్యార్థుల వివరాల కంప్యూటరీకరణ

కురుపాం రూరల్: గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థుల వివరాలను చురుగ్గా ఆన్‌లైన్ చేస్తున్నారు. జాతీయ విద్యా విధానంలో భాగంగా 6-14 మధ్య వయస్కులకు నిర్బంధంగానైనా విద్యను అందించాల్సి ఉంది. దీనిలో భాగంగా దేశంలోని పిల్లల అందరి వివరాలు, వారి తల్లిదండ్రుల వివరాలను చురుగ్గా ఆన్‌లైన్ చేస్తున్నారు. విద్యార్థుల డేటా ఆన్‌లైన్ అయిన తర్వాత ప్రతి విద్యార్థికి ఒక గుర్తింపు కార్డును ఇవ్వనున్నారు. ఆ ప్రక్రియను ఏపీఏఏఆర్ (ఆటోమేటెడ్ పర్మినెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ) అని సంబోధిస్తున్నారు. ఈ ప్రక్రియ వల్ల విద్యార్థులు స్కూళ్లలో నమోదు, హాజరు, విద్యా పురోగతి, డ్రాపౌట్లు తదితర అంశాలను సులువుగా ట్రాక్ చేయడానికి వీలుంటుందని మండల విద్యాశాఖాధికారి ఎస్.సత్యన్నారాయణ తెలిపారు.

మద్యం దుకాణాల మూసివేత

గరుగుబిల్లి: ప్రభుత్వ మద్యం దుకాణాల్లో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తున్న నేపథ్యంలో సోమవారం మద్యం దుకాణాలను మూసివేశారు. మంగళవారం నుంచి నూతన మద్యం పాలసీ అమలు చేయనున్న నేపథ్యంలో సిబ్బందిలో ఆందోళన నెలకొంది. జిల్లాకు సంబంధించి ఏపీ బేవరేజ్ కార్పొరేషన్ పరిధిలో 53 మంది సూపర్‌వైజర్లు, 159 మంది సేల్స్‌మెన్లు, 48 మంది వాచ్‌మెన్‌లు గత వైసీపీ ప్రభుత్వ హయాంలో నియమించారు. కార్పొరేషన్ నిబంధనల మేరకు వీరికి అవసరమైన వేతనాలు అందించనున్నారు. సూపర్‌వైజర్‌కు రూ.19,500, సేల్స్‌మెన్‌కు రూ.1,500, వాచ్‌మెన్‌కు రూ.11వేలు చొప్పున అందించేవారు. నూతన కూటమి ప్రభుత్వం తగు నిర్ణయం తీసుకుని విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి ఉపాధి కల్పించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. కాంట్రాక్టు ఉద్యోగాల తొలగింపు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని కోరుతున్నారు.

గోతులు పూడ్చేందుకు తీర్మానం

సాలూరు రూరల్: పట్టణంలో గుర్తించిన 18 గోతులను పూడ్చాలని మున్సిపల్ సమావేశంలో తీర్మానించారు. సోమవారం స్థానిక మున్సిపాల్టీ కార్యాలయంలో చైర్‌పర్సన్ పువ్వల ఈశ్వరమ్మ అధ్యక్షతన సాలూరు మున్సిపల్ కౌన్సిలర్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పట్టణంలో గుర్తించిన గోతులను పూడ్చాలని, మున్సిపల్ పరిధిలో రూ.36లక్షలతో కాలువల్లో పూడికతీత పనులు చేయాలని తీర్మానించారు. అన్న క్యాంటీన్ భవన నిర్మాణం తదితర పనులపై చర్చించారు. ఐదు అంశాలతో సమావేశం నిర్వహించారు. పట్టణంలో కాలువలు, రోడ్లు తదితర సమస్యలను పరిష్కరించాలని మహిళా కౌన్సిలర్ మొయిద వైదేహి ప్రశ్నించారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

చోరీ కేసులో వ్యక్తి అరెస్టు

వీరఘట్టం: మండలంలోని బిటివాడ గ్రామంలో ఇటీవల జరిగిన చోరీ కేసును పోలీసులు ఛేదించారు. నిందితుడు యోగేశ్వరరావును వండువ జంక్షన్ వద్ద పోలీసులు ఆదివారం పట్టుకున్నారు. అతని వద్ద నుంచి ఆరున్నర తులాల బంగారం, 37 తులాల వెండిని స్వాధీనం చేసుకున్నారు. సోమవారం కోర్టుకు అప్పగించినట్టు ఎస్ఐ కళానిధి తెలిపారు.

భామినిలో వర్షం

భామిని: భామినితో పాటు సమీప గ్రామాల్లో సోమవారం వర్షం కురిసింది. ఈ వర్షం వల్ల అలికాం-బత్తిలి రహదారి గుంతల్లో నీరు చేరింది. దీంతో వాహనదారులు రాకపోకలకు ఇబ్బందులు పడ్డారు. కొంత సమయం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.


భామినిలో వర్షం కురుస్తున్న దృశ్యం

జిల్లా యువతకే ఉద్యోగాలు ఇవ్వాలి

ఒడిశా


ఆందోళన చేస్తున్న నిరుద్యోగులు

రాయగడ: ప్రభుత్వ కార్యాలయాల్లో చేపడుతున్న ఉద్యోగ నియామకాల్లో జిల్లావాసులకే అవకాశం ఇవ్వాలని ఉపాధ్యాయ శిక్షణ పూర్తిచేసిన నిరుద్యోగులు, పట్టభద్రులు సోమవారం స్థానిక కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తిలో జిల్లా వాసులకు కాకుండా రాష్ట్ర స్థాయిలో నియామకాలు చేపట్టి ఇతర జిల్లావాసులకు ఉద్యోగాలు కల్పించడంతో తాము నిరుద్యోగులుగా మిగిలిపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. సి గ్రేడ్, బి గ్రేడ్‌లను రద్దుచేసి జూనియర్ టీచర్స్‌గా తమను గుర్తించాలని, అలాగే అన్ని ప్రభుత్వ నియామకాల్లో నిరుద్యోగ యువతకు అవకాశం కల్పించాలని కోరుతూ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

రాయగడ జిల్లాకు తొలి మహిళా ఎస్పీ


ఎస్పీ స్వాతి

రాయగడ: రాయగడ జిల్లా ఏర్పడి మూడు దశాబ్దాలు దాటిన తర్వాత తొలిసారిగా ఓ మహిళా ఎస్పీని ప్రభుత్వం నియమించింది. రాయగడ జిల్లా ఎస్పీగా నియమితులైన స్వాతి ఎస్.కుమార్ ఇప్పటివరకు గజపతి జిల్లాలో పనిచేశారు. రాయగడ ఎస్పీ హరీష్ బీసీని కొంధమాల్ జిల్లాకు బదిలీ చేస్తూ హోంశాఖ ఉత్తర్వులు జారీచేసింది.

గుణుపూర్‌లో వినతుల స్వీకరణ

రాయగడ: గుణుపూర్ సబ్‌డివిజన్‌లో సోమవారం జిల్లా యంత్రాంగం వినతుల స్వీకరణ కార్యక్రమం చేపట్టింది. కలెక్టర్ పారుల్ పట్వార్ అధ్యక్షతన గుణుపూర్ సబ్‌కలెక్టర్ కార్యాలయం సమావేశ హాలులో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా అటవీ శాఖాధికారి సచిన్ అప్పాసాహెబ్ ఒహెల్, సబ్ కలెక్టర్ కిరణ్‌దీప్ కౌర్, జడ్పీ కార్య నిర్వాహణాధికారి నిహర్‌రంజన్ కహార్‌లు అర్జీదారుల సమస్యలను విన్నారు. మొత్తం 69 ఫిర్యాదులు అందాయి. వాటిని పరిశీలించిన కలెక్టర్ వెంటనే పరిష్కరించవలసిందిగా సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రవాణా శాఖాధికారి శివశంకర్ చౌదురి, ముఖ్య వ్యవసాయ అధికారి సుమన్‌సింగ్ పట్నాయక్, ఎల్.సతీష్‌కుమార్, ధనుంజయ బెహెరా, అన్ని విభాగాల అధికారులు పాల్గొన్నారు.

ఫిర్యాదుల పరిష్కారమే ధ్యేయం: ఎస్పీ


సమస్యలు వింటున్న ఎస్పీ

బెలగాం: ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను పరిష్కరించడమే పోలీసుల బాధ్యత అని ఎస్పీ ఎస్వీ మాధవరెడ్డి అన్నారు. సోమవారం స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆయన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. మొత్తం 9 ఫిర్యాదులు అందినట్టు ఆయన తెలిపారు. ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించి న్యాయం చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఎక్కువగా నకిలీ పత్రాలు, కుటుంబ తగాదాలు, ఆన్‌లైన్ మోసాలు, భూ సమస్యలపై, తదితర సమస్యలు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీఆర్‌బీ సీఐ ఎర్రంనాయుడు, ఎస్బీ సీఐ జి.దేముడుబాబు, ఎస్ఐ పాపారావు తదితరులు పాల్గొన్నారు.

ఐటీడీఏ గ్రీవెన్స్‌కు 56 వినతులు


సమస్యలు వింటున్న ఐటీడీఏ పీవో

సీతంపేట రూరల్: సీతంపేట ఐటీడీఏలో పీవో సి.యశ్వంత్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 56 వినతులు వచ్చాయి. ఈ ప్రజా వేదికలో ఏపీవో జి.చిన్నబాబు, డీడీ అన్నదొర, పీహెచ్‌వో వెంకటగణేష్, డిప్యూటీ డీఈవో పి.నారాయుడు, ఏఎంవో కోటిబాబు, సీడీపీవో రంగలక్ష్మి, పలు శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

సామాజిక తనిఖీ నిష్పక్షపాతంగా ఉండాలి

జియ్యమ్మవలస: మండలంలో ఉపాధి హామీ పనులపై చేసే సామాజిక తనిఖీ నిష్పక్షపాతంగా నిర్వహించాలని ఎంపీపీ బొంగు సురేష్ తనిఖీ బృందాన్ని కోరారు. సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో సామాజిక తనిఖీ బృందంతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఉపాధి హామీ అధికారులు, సిబ్బంది సక్రమంగా పనిచేసినప్పటికీ ఏడుగురు క్షేత్ర సహాయకుల వల్ల మండలానికి కొంత చెడ్డ పేరు వచ్చిందన్నారు. సామాజిక తనిఖీలో అవినీతి అక్రమాలు పూర్తిగా బయటకు తీయాలని ఆయన కోరారు. ఎవరి ప్రలోభాలకు తలవంచొద్దని అన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో కె.రామారావు, పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీలో నిబంధనలు తప్పనిసరి

గరుగుబిల్లి: మండలంలోని 13 సచివాలయాల పరిధిలో నిబంధనల మేరకు పింఛన్లు పంపిణీ చేయాలని ఎంపీడీవో జి.పైడితల్లి సూచించారు. సోమవారం ఆమె విలేకర్లతో మాట్లాడుతూ 25 పంచాయతీల పరిధిలో 8,226 మందికి వివిధ రకాల పింఛన్లను అందించనున్నట్లు తెలిపారు. గ్రామ స్థాయిలో నియమించిన సిబ్బంది మంగళవారం విధిగా ఇంటింటికి వెళ్లి, అందించాలన్నారు. పింఛన్లకు రూ.3కోట్ల 37 లక్షల 3 వేలు విడుదలయ్యా యన్నారు. పింఛన్‌దారులు మృతి చెందినట్లయితే ఆ మొత్తాలను కార్యాలయానికి జమ చేయాలని సూచించారు. పంపిణీలో ఆరోపణలకు తావు లేకుండా వ్యవహరించాలన్నారు.

ఎస్‌డబ్ల్యూపీసీల నిర్వహణపై అలసత్వం వద్దు

గరుగుబిల్లి: పంచాయతీల పరిధిలోని చెత్త సంపద కేంద్రాల (ఎస్‌డబ్ల్యూపీసీ)ను వినియోగించుకోవాలని ఎంపీడీవో జి.పైడితల్లి, ఈవోపీఆర్డీ ఎల్.గోపాలరావు అన్నారు. మండలంలోని శివ్వాం, కొత్తపల్లి గ్రామాల్లో ఎస్‌డబ్ల్యూపీసీలను ఆమె సోమవారం ప్రారంభించారు. కేంద్రాల నిర్వహణపై అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని ఆమె హెచ్చరించారు. కార్యదర్శి బి.అప్పారావు, మోహనరావు, పెంటయ్య, బి.నారాయణస్వామి, జి.అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

● **సీతంపేట రూరల్:** సీతంపేట పంచాయతీ పరిధిలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని(ఎస్‌డబ్ల్యూపీసీ) సర్పంచ్ ఆరిక కళావతి సోమవారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఎంపీడీవో గీతాంజలి మాట్లాడుతూ ఎస్‌డబ్ల్యూపీసీలు పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకురావడం కోసం సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు కృషి చేయాలన్నారు. పంచాయతీ కార్యదర్శి బి.సుదర్శన్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జనవాణిలో పాలకొండ ఎమ్మెల్యే


వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే జయకృష్ణ

సీతంపేట రూరల్: మంగళగిరిలోని జనసేన పార్టీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన జనవాణి కార్యక్రమంలో పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ పాల్గొని వినతులు స్వీకరించా రు. ఉప ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు గత కొన్ని రోజులుగా నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో జనసేన పార్టీ ఎమ్మెల్యేలు పాల్గొ, ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్నారు.

వసతి గృహాల్లో మౌలిక వసతులు కల్పించాలి

బెలగాం: వసతి గృహాల్లో విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.విజయకల్యాణి అన్నారు. స్థానిక బీసీ సంక్షేమ బాలికల వసతి గృహాన్ని ఆమె సోమవారం సందర్శించారు. ఈసందర్భంగా వసతి గృహంలోని రికార్డులను తనిఖీ చేశారు. వంట గదిని, స్టోర్‌రూంను పరిశీలించారు. విద్యార్థులకు సక్రమంగా మెనూ అందుతుందా లేదా.. అని ఆరా తీశారు. వసతి గృహం భవనం పెచ్చులూడుతూ ఉండడంతో మరమ్మతులు చేయాలని వార్డెన్ సుభద్రకు ఆదేశించారు. మరుగుదొడ్లు అపరిశుభ్రంగా ఉండడం గమనించి పరిశుభ్రంగా ఉంచాలని అటెండర్‌కు సూచించారు. విద్యకు సంబంధించిన పథకాల వివరాలను అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ అధికారి ఇ.అప్పన్నను అడిగి తెలుసుకున్నారు. సకాలంలో విద్యార్థులకు వైద్య సేవలు అందించడానికి వైద్య సిబ్బంది అందుబాటులో ఉంటున్నారా.. లేరా.. అని ఆరా తీశారు.

రేపు గ్రామ సభలు

వీరఘట్టం: గాంధీ జయంతి సందర్భంగా బుధవారం అన్ని గ్రామాల్లోనూ ఉపాధి పనులపై గ్రామసభలు నిర్వహించాలని ఏపీడీ జి.శ్రీహరి సిబ్బందికి ఆదేశించారు. సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఆయన ఉపాధి హామీ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఏపీవో జి.సత్యంనాయుడు, ఈసీ కృష్ణ ప్రసాద్, టెక్నికల్ అసిస్టెంట్లు, సిబ్బంది పాల్గొన్నారు. ● **గరుగుబిల్లి:** ఉపాధి హామీ పనులపై క్షేత్ర స్థాయి సిబ్బంది గ్రామ సభలు నిర్వహించాలని ఏపీవో ఎం.గౌరీనాథ్ సూచించారు. సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఫీల్డ్, టెక్నికల్ అసిస్టెంట్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గాంధీ జయంతిని పురస్కరించుకుని అక్టోబరు 2న అన్ని పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహించాలని తెలిపారు. గ్రామసభల్లో తయారు చేసిన ప్రణాళికలను నవంబరు 10వ తేదీలోగా పూర్తి చేయాలని సూచించారు. సమావేశంలో ఉపాధి ఈసీ మరిశర్ల హరికృష్ణ పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయాన్ని విస్తరించండి

గరుగుబిల్లి: గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయాన్ని పూర్తిస్థాయిలో విస్తరించేందుకు కృషి చేయాలని ప్రకృతి వ్యవసాయ రీజనల్ లీడ్ అధికారులు కె.ప్రకాష్, జి.హేమసుందర్ సూచించారు. సోమవారం తోటపల్లి జట్టు ప్రాంగణంలో ముగింపు శిక్షణకు వీరు హాజరయ్యారు. జర్మన్ గ్లోబల్ అకాడమీ సహకారంతో రైతు సాధికారిక సంస్థ సమక్షంలో జట్టు సంస్థ ఆధ్వర్యంలో నాలుగు రోజుల పాటు ఫార్మర్ సైంటిస్ట్ శిక్షణను నిర్వహించారు. ఈసందర్భంగా వీరు మాట్లాడుతూ సహజంగా రైతులకు లభ్యమయ్యే వాటితో కషాయాలు తయారీ చేసి ఉపయోగించాలన్నారు. ఈ శిక్షణలో శ్రీకాకుళం, మన్యం జిల్లాలకు సంబంధించి 87 మంది హాజరయ్యారు. డాక్టర్ డి.పారినాయుడు, జిల్లా ప్రకృతి వ్యవసాయ డీపీఎం షణ్ముఖరాజు, పి.దేవుళ్లతో పాటు సిబ్బంది వి.నాగరాజ్, బిగణేష్, మానస, తదితరులు పాల్గొన్నారు.

పేదలకు న్యాయం చేయాలి

మక్కువ: తూరుమామిడి గ్రామంలో ఇళ్లు కట్టుకున్న పేదలకు న్యాయం చేయాలని ఏపీ రైతు కూలి సంఘం జిల్లా కార్యదర్శి ఎం.కృష్ణమూర్తి అన్నారు. ఈ మేరకు సోమవారం ఆయన ఆ గ్రామాన్ని సందర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇక్కడ సరిహద్దులు వేయకుండా పేదలకు పట్టాలు ఇచ్చారని, ఆ స్థలాల్లో ఎవరికి నచ్చిన చోట వారు ఇళ్లు కట్టుకుంటే స్థానిక సర్పంచ్ రాజకీయకక్షతో కూల్చివేయడానికి ప్రయత్నించడం ఎంతవరకు సమంజసమన్నారు. మక్కువ, భైరిసాగరం చెరువు ఆక్రమణకు గురైనా అధికారులు పట్టించుకోలేదన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు, పేదలు పాల్గొన్నారు.

క్లుప్తంగా..

మెప్మా అర్బన్ మార్కెట్ ప్రారంభం

పాలకొండ: పట్టణంలోని కోటదుర్గమ్మ ఆలయ సమీపంలో ఏర్పాటుచేసిన మెప్మా అర్బన్ మార్కెట్‌ను టీడీపీ పట్టణ అధ్యక్షుడు గంటా సంతోష్ సోమవారం ప్రారంభించారు. ఈ మార్కెట్‌లో ఎస్‌హెచ్‌జీ మహిళలు తయారు చేసే ఉత్పత్తులను విక్రయించనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో మెప్మా సీఎంఎం కృష్ణారావు, లలిత, దానాలమ్మ, యేసు, శ్యామల, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఎస్పీని కలిసిన ఎస్‌బీ సీఐ

బెలగాం: స్పెషల్ బ్రాంచ్ సీఐగా బాధ్యతలు చేపట్టిన జి.దేముడుబాబు సోమవారం స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ మాధవరెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. శాంతిభద్రతల పరిరక్షణకు చేపట్టవలిసిన చర్యలను, స్పెషల్ బ్రాంచ్ నిర్వహించాల్సిన విధులను సీఐకి ఎస్పీ దిశానిర్దేశం చేశారు.

ఎక్సైజ్ సీఐ పద్మావతి బాధ్యతల స్వీకరణ

సీతానగరం: మండలంలోని ఎక్సైజ్ స్టేషన్‌లో సీఐగా డి.పద్మావతి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ బలిజిపేట, గరుగుబిల్లి, సీతానగరం మండలాలకు సంబంధించి అక్రమంగా మద్యం విక్రయాలు జరిగితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వం రెండు రోజుల్లో వైన్ షాపులకు నోటిఫికేషన్ జారీ చేస్తుందని ఆమె తెలిపారు. పార్వతీపురం ఎక్సైజ్ స్టేషన్‌లో ఎస్ఐగా పనిచేస్తూ పదోన్నతిపై సీఐగా సీతానగరంలో బాధ్యతలు స్వీకరించినట్టు ఆమె తెలిపారు.

జియ్యమ్మవలస ఎస్ఐగా ప్రశాంత్‌కుమార్

జియ్యమ్మవలస: మండల పోలీస్‌స్టేషన్ ఎస్ఐగా ఎన్.ప్రశాంత్‌కుమార్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన గతంలో పాలకొండ పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐగా పనిచేస్తూ వీఆర్‌లో ఉన్నారు. ఈయనను జియ్యమ్మవలస ఎస్ఐగా నియమిస్తూ ఎస్పీ మాధవరెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు.

స్పందించారు.. స్తంభం తొలగించారు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

మక్కువ: స్థానిక జంగాల వీధిలో దశాబ్దాల కిందట ఏర్పాటుచేసిన ఇనుప విద్యుత్ స్తంభాన్ని అధికారులు సోమవారం తొలగించారు. రోడ్డు మధ్యలో ప్రమాదకరం గా ఉన్న ఈ స్తంభాన్ని తొలగించకపోవడంపై 'పొంచి ఉన్న ప్రమాదం' శీర్షికతో ఆంధ్రజ్యోతిలో సోమవారం కథనం ప్రచురితమయ్యింది. దీనిపై అధికారులు స్పందించి ఆ స్తంభాన్ని తొలగించారు.

మంత్రిని కలిసిన ఐటీడీఏ పీవో

సాలూరు రూరల్: పార్వతీపురం ఐటీడీఏ ఇన్‌చార్జి పీవోగా బాధ్యతలు స్వీకరించిన పార్వతీపురం సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ మంత్రి గుమ్మిడి సంధ్యారాణిని సోమవారం కలిశారు. గిరిజన అభివృద్ధికి కృతనిశ్చయంతో పనిచేయాలని ఆమె సూచించారు.

సర్పంచ్‌లకు గౌరవమివ్వండి

సాలూరు రూరల్: అధికా రులు తమకు విలువనివ్వడం లేదంటూ సాలూరు వైస్ ఎంపీపీ రెడ్డి సురేష్ ఆధ్వర్యంలో పలువురు సర్పంచ్‌లు సోమవారం కలెక్టర్ శ్యాంప్రసాద్‌కు వినతిపత్రం అందిం చారు. సర్పంచ్‌ల తీర్మానం లేకుండానే కొన్ని పనులు చేస్తున్నారని ఆరోపించారు. పింఛన్ పంపిణీకి కూడా తమను పిలవడం లేదని తెలిపారు.

పవన్ దీక్షకు మద్దతుగా పూజలు

మక్కువ: తిరుపతి లడ్డూ కల్తీ ఘటనకు నిరసనగా జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ చేపట్టిన దీక్షకు మద్దతుగా సాలూరు నియోజకవర్గ పార్టీ సమన్వయకర్త గేదెల రిషివర్ధన్ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక శివాలయంలోవద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు.

● **కొమరాడ:** గుంప సోమేశ్వరస్వామి ఆలయంలో జనసేన పార్టీ కురుపాం నియోజకవర్గ ఇన్‌చార్జి కద్రక మల్లేష్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.


మక్కువ: శివాలయంలో..


కొమరాడ: గుంప సోమేశ్వరస్వామి ఆలయంలో..

బకాయిలు చెల్లించండి

- గిరిజన గర్భిణుల వసతిగృహ సిబ్బంది నిరసన


కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న సిబ్బంది

బెలగాం: వైటీసీలో గిరిజన గర్భిణుల వసతి గృహంలో పనిచేస్తున్న సిబ్బందికి వేతన బకాయిలు చెల్లించాలని గిరిజన నాయకుడు పాలక రంజిత్‌కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం స్థానిక కలెక్టర్ కార్యాయం వద్ద నిరసన తెలిపి జేసీ శోభితకు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్వతీపురం ఐటీడీఏ పరిధిలోని సాలూరు, గుమ్మలక్ష్మీపురం వైటీసీలోని గిరిజన గర్భిణుల వసతిగృహంలో విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి 15 నెలలుగా వేతనాలు ఇవ్వడం లేదన్నారు. వేతనాలు ఇవ్వకపోతే కుటుంబాలతో వారు ఎలా బతుకుతారని ప్రశ్నించారు. అధికారులు స్పందించి బకాయి వేతనాలు తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. సిబ్బంది పాల్గొన్నారు.

కనీస వేతనం ఇవ్వాలి

- కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల నిరసన



నిరసన తెలుపుతున్న సీఐటీయూ నాయకులు

బెలగాం: కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు కనీస వేతనం అమలు చేయాలని సీఐటీయూ నాయకుడు బీవీ రమణ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం స్థానిక కలెక్టర్ కార్యాలయం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను క్రమబద్ధీకరించి ఉద్యోగభద్రత కల్పించాలని, కనీస వేతనం రూ.26వేలు అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు జి.రమణ, ఇందిర తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ సమస్యలు పరిష్కరించాలి

సాలూరు రూరల్: అంగన్‌వాడీ కార్యకర్తలకు ఎన్నికల ముందు ప్రకటించిన హామీలను అమలు చేయాలని మంత్రి సంధ్యారాణిని ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కె.సుబ్బారావమ్మ కోరారు. సోమవారం సాలూరు వచ్చిన ఆమెకు వినతిపత్రం అందించారు. వేతనాలు పెంచాలని, మినీ సెంటర్లు మెయిన్ సెంటర్లుగా మార్పు చేయాలని కోరారు. ఎస్వై నాయుడు, శశికళ పాల్గొన్నారు.